RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా నినాదం

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా నినాదం
18వ వసంతంలోకి

EDITOR :Boorla Venkatesham KARIMNAGAR VOLUME:18 ISSUE:36 FRIDAY , JUNE 5,2026 PAGES:20 COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :36 శుక్రవారం , జూన్ 5, 2026, పేజీలు -20 వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## వ్యవసాయ శాఖ ఆస్తుల రక్షణకు ఐఏఎస్‌లతో కమిటీ: మంత్రి తుమ్మల



ధర్మఘంట జూన్ 04

వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులను ముందుగానే సన్నద్ధం చేయాలని ఉన్నతాధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఎల్– నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల సాగు పై గ్రామసభల్లో రైతులకు అవగాహన - మిగతా2లో

## భూముల ధరల పెంపు: మంత్రి పొంగులేటి



ధర్మఘంట జూన్ 04

మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు శుక్రవారం నుంచి పెరుగుతాయని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. భూముల ధరలు ఏరియాను బట్టి 50 నుంచి100 శాతం పెరుగుతాయని తెలిపారు. ప్రైమ్ ఏరియాలో 100 శాతం పెరుగుతాయన్నారు. గురువారం హైదరాబాద్ లోని సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. భూముల వ్యాల్యూ పెరగటంతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1200 నుంచి రూ.1400 కోట్ల మేర ఆదాయం - మిగతా2లో

## మమతకు భారీ షాక్: బీజేపీ వైపు 20 మంది టీఎంసీ ఎంపీల చూపు!

- టీఎంసీలో తీవ్రరూపం దాల్చిన సంక్షోభం
- ప్రతిపక్ష నేతగా రెబల్ ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీకి గుర్తింపు
- బీజేపీతో టచ్‌లో 20 మంది టీఎంసీ ఎంపీలు ఉన్నట్లు ఊహాగానాలు
- మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీ పై అసంతృప్తితోనే తిరుగుబాటు
- బెంగాల్‌లో పార్టీ కమిటీలన్నింటినీ రద్దు చేసిన టీఎంసీ



2

## ఏదో ఒక రోజు ఆయన్ను కలుస్తా.. ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు

ధర్మఘంట జూన్ 04

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఏదో ఒక రోజు ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీని కలుస్తానన్నారు. ఇప్పటివరకు మొజ్తాబాను కలిసే అవకాశం రాలేదని చెప్పిన ట్రంప్.. ఆయన పాలనాతీరు ఏమీ బాగాలేదని, చాలా విషయాలలో వెనుకబడి ఉన్నారని విమర్శించారు. - మిగతా2లో



## విదేశీయుల వివరాలు 24 గంటల్లో ఇవ్వాలి: హైదరాబాద్ పోలీసుల హెచ్చరిక




2

- ఇమ్మిగ్రేషన్ చట్టం 2025 ప్రకారం పోలీసుల తాజా అడ్వైజరీ
- నిబంధనలు పాటించని యజమానులు, విద్యాసంస్థలపై కఠిన చర్యలు
- విదేశీయుల కదలికల పై నిఘా పెంచడమే లక్ష్యమన్న పోలీసులు

## రూపాయి కూడా తేలేదు: కిషన్ రెడ్డి, బండి సంజయ్ ల పై కడియం శ్రీహరి ఫైర్



ధర్మఘంట జూన్ 04

కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తన క్యాంప్ ఆఫీస్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన ఆయన.. కేంద్ర మంత్రులు ఇద్దరూ తెలంగాణ అభివృద్ధికి ఒక్క - మిగతా2లో

## సస్పెండెడ్ ఏఎస్పీ భుజంగరావు అరెస్ట్, రూ.100 కోట్లకు పైగా ఆస్తుల గుర్తింపు



ధర్మఘంట జూన్ 04

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న సస్పెండెడ్ అదనపు ఎస్పీ నాయిని భుజంగరావును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అరెస్ట్ చేసింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆయనను నిన్న అరెస్ట్ చేసి- మిగతా2లో

## తెలంగాణకు వ్యతిరేకంగా.. పవన్ ఎప్పుడూ మాట్లాడలేదు: రాంచందర్ రావు

ధర్మఘంట జూన్ 04

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మీటింగ్‌కి అనుమతి ఇస్తే ఏమవుతుంది..? అని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రశ్నించారు.తెలంగాణకు వ్యతిరేకంగా.. పవన్ ఎప్పుడూ మాట్లాడలేదని అన్నారు. గురువారం హైదరాబాద్ వేదికగా రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సెంటిమెంట్‌ని మరోసారి రెచ్చగొట్టే ప్రయత్నం - మిగతా2లో



## చంచల్‌గూడ జైల్లో బాల్క సుమన్‌ను కలిసిన కేటీఆర్

ధర్మఘంట జూన్ 04

చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈరోజు ములాఖత్‌లో కలిశారు. కేటీఆర్‌తో పాటు పార్టీ సీనియర్ నేతలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సుధీర్ రెడ్డి కూడా - మిగతా2లో



## మమతకు భారీ షాక్: బీజేపీ వైపు 20 మంది టీఎంసీ ఎంపీల చూపు!

-మొదటిపేజీ తరువాయి

పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ చరిత్రలోనే అతిపెద్ద సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మొదలైన అసమ్మతి, ఇప్పుడు ఎమ్మెల్యేల తిరుగుబాటుతో తీవ్రస్థాయికి చేరింది. ఈ సంక్షోభం రాష్ట్రానికే పరిమితం కాకుండా, ఢిల్లీకి కూడా పాకింది. ఏకంగా 20 మంది లోక్‌సభ సభ్యులు పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారనే వార్తలు మమతా బెనర్జీకి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. జూన్ 3న, పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీని ప్రతిపక్ష నేతగా అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్ గుర్తించారు. తమకు 58 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని రెబల్ వర్గం ప్రకటించింది. దీంతో అసెంబ్లీలో మమతా బెనర్జీ వర్గం బలహీనపడింది. మొత్తం 80 మంది టీఎంసీ ఎమ్మెల్యేలలో అధికశాతం మంది రెబల్ వర్గం వైపు ఉన్నారు. ఏప్రిల్-మే నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరపడిన తర్వాత ఈ సంక్షోభం మొదలైంది. ప్రతిపక్ష నేత ఎంపిక విషయంలో పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని రెబల్ ఎమ్మెల్యేలు వ్యతిరేకించారు. మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ వ్యవహార శైలి, ఎన్నికల ఓటమి తర్వాత ఆయన పెత్తనం చెలాయించడమే ఈ తిరుగుబాటుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. తామంతా మమతా బెనర్జీ నాయకత్వాన్ని గౌరవిస్తామని, కానీ అభిషేక్ పెత్తనాన్ని సహించ బోమని రెబల్ ఎమ్మెల్యేలు స్పష్టం చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో, సుమారు 20 మంది టీఎంసీ ఎంపీలు బీజేపీ నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.

## సస్పెండెడ్ ఏఎస్పీ భుజంగరావు అరెస్ట్, రూ.100 కోట్లకు పైగా ఆస్తుల గుర్తింపు

-మొదటిపేజీ తరువాయి

దీంతో అధికారులు ఆయన్ను చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించారు. నిన్న ఉదయం నుంచి ఏసీబీ అధికారులు భుజంగరావుతో పాటు ఆయన బంధువులు, సన్నిహితులకు చెందిన సుమారు 15 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని హఫీజ్‌పేట, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో ఈ తనిఖీలు జరిగాయి. ఈ సోదాల్లో రూ.5.92 కోట్ల విలువైన ఆస్తులకు సంబంధించిన పత్రాలను గుర్తించినట్లు ఏసీబీ అధికారులు అధికారికంగా ప్రకటించారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల్లో 27.29 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లో రెండు ఇళ్లు, ఐదు ఓపెన్ ప్లాట్లు, ఒక వాణిజ్య భవనం ఉన్నాయి. వీటితో పాటు రూ.3.83 లక్షల నగదు, కిలో బంగారం, రెండు కార్లను కూడా గుర్తించారు. ఈ ఆస్తుల డాక్యుమెంట్ విలువ రూ.5.92 కోట్లుగా ఉన్నప్పటికీ, బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రూ.100 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. భుజంగరావు ఇంట్లో 29 మద్యం సీసాలు లభించడంతో, ఆ విషయాన్ని ఎక్సైజ్ శాఖకు నివేదించినట్లు ఏసీబీ తెలిపింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, ఇతర ప్రముఖుల ఫోన్లను అక్రమంగా ట్యాపింగ్ చేశారన్న ఆరోపణలపై నమోదైన కేసులో భుజంగరావు నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో ఆయనను 2024 మార్చిలో అరెస్ట్ చేయగా, తర్వాత తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. తాజాగా అక్రమాస్తుల కేసు నమోదు కావడంతో ఏసీబీ ఆయన్ను మరోసారి అరెస్ట్ చేసింది. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

## రూపాయి కూడా తేలేదు: కిషన్ రెడ్డి, బండి సంజయ్ లపై కడియం శ్రీహరి ఫైర్

-మొదటిపేజీ తరువాయి

ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల దశాబ్దాల కల అయిన ‘కాజీపేట రైల్వే డివిజన్’ను తక్షణమే ఏర్పాటు చేయాలని శ్రీహరి కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. ఈ డివిజన్ ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతంలో పారిశ్రామిక వృద్ధి పెరగడమే కాకుండా, స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన స్పష్టం చేశారు. గత 12 ఏళ్లుగా బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణను ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేస్తోందని.. అసలు ప్రధాని మోదీకి, బీజేపీకి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఇష్టం లేదని ఆరోపించారు. కేంద్ర మంత్రులు కేవలం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని, బండి సంజయ్ చెబుతున్న రూ.13 లక్షల కోట్ల నిధుల్లో రాష్ట్రానికి వచ్చిన ప్రాజెక్టులు ఏవో శ్వేతపత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు. ఇదే సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీరును కూడా శ్రీహరి తప్పుపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ వాడుతున్న భాష ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ఆయనకు నాయకత్వ లక్షణాలు లేవనే విషయాన్ని స్వయంగా ఆయన సోదరే (కవిత) గతంలో చెప్పిన విషయాన్ని గుర్తుంచుకోవాలి“ అని వ్యాఖ్యానించారు.

## చంచల్‌గూడ జైల్లో బాల్క సుమన్‌ను కలిసిన కేటీఆర్

-మొదటిపేజీ తరువాయి

జైల్లో ఉన్న సుమన్‌కు పార్టీ పూర్తి అండగా ఉంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ భరోసా ఇచ్చారు. సింగరేణి కాలరీస్ ఆస్తులను ధ్వంసం చేయాలంటూ, రైలు పట్టాలు కోసేయాలంటూ బాల్క సుమన్ ఇటీవల రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో ఆయనపై నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ తర్వాత ఈ కేసును బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. గడిచిన మే 26న తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన బహిరంగ సభలో బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ.. సింగరేణి కాలరీస్‌కు చెందిన జూనియర్ అసిస్టెంట్ ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ అరెస్ట్ చర్యలు చేపట్టారు.

## వ్యవసాయ శాఖ ఆస్తుల రక్షణకు ఐఏఎస్‌లతో కమిటీ: మంత్రి తుమ్మల

-మొదటిపేజీ తరువాయి

కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తక్కువ నీటితో పంటల సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులకు స్పష్టం చేశారు. పంట వ్యర్థాలను కాల్చడంపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అందుకోసం అన్ని జిల్లాల్లో శాటిలైట్ ఆధారిత పంట వ్యర్థాల కాల్చివేతలపై పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. కొహెడ అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ శంకుస్థాపనకు ఏర్పాట్లు వేగవంతం చేసినట్లు చెప్పారు. రూ. 2,284.32 కోట్లతో కొహెడలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్ నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. జూన్ 6వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఇక వ్యవసాయశాఖకు చెందిన ఖాళీ భూముల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామన్నారు. ఈ ఆస్తుల రక్షణ కోసం ఐఏఎస్ అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఖాళీ స్థలాల్లో ప్లాంటేషన్ లేదా లీజు ద్వారా ఆదాయం సమీకరణ చేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. తెలంగాణ ప్రభుత్వానికి చెందిన ఫెర్టిలైజర్ యాప్‌కు కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రశంసలు కురిపించిందని చెప్పారు. తెలంగాణ ఎరువుల పర్యవేక్షణ విధానం దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. కేంద్ర ఫెర్టిలైజర్ యాప్ అమలుకు తెలంగాణను పైలట్ రాష్ట్రంగా ఎంపిక చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. యాప్ సమర్థ అమలుకు రాష్ట్రానికి ప్రోత్సాహకాలు అందిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. జూన్ 4, 6, 8, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. రైతులకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది సేవలు అందించాలని వారికి మంత్రి పొంగులేటి సూచించారు.

## భూముల ధరల పెంపు: మంత్రి పొంగులేటి

-మొదటిపేజీ తరువాయి

వస్తుందని చెప్పారు. హయ్యర్ సైడ్ ఏరియాలు శేరిలింగంపల్లి, రాజేందర్ నగర్, ఖాజాగూడ తదితర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగవన్నారు. ఆయా ప్రాంతాల్లో ఛార్జీలు పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని తెలిపారు. ఇక నుంచి సబ్ రిజిస్ట్రర్లకు ఫుల్ పవర్స్ కట్ చేశామని.. వారికి మినిమమ్ పవర్స్ మాత్రమే ఉంటాయని మంత్రి పొంగులేటి వివరించారు. భూ సేకరణ సమయంలో ప్రభుత్వానికి కొంత నష్టం జరిగిందన్నారు. కానీ రైతులకు మాత్రం లాభం జరుగుతుందన్నారు. ఇన్నర్ సైడ్ ఎకరం కనీసం రూ.15 లక్షలు ఉందని చెప్పారు. లోయర్ సైడ్ ఏమైనా పొరపాటు జరిగితే మార్పులు చేర్పులు ఉంటాయని చెప్పారు. హయ్యర్ సైడ్ మాత్రం మార్పులు ఉండవన్నారు. సమస్యలు ఉంటే.. హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్ ఏర్పాటు చేస్తామని పబ్లిక్‌కు ఆయన సూచించారు. త్వరలో తహసీల్దార్ల బదిలీలు ఉంటాయని చెప్పారు. ఫ్యూచర్ సిటీని రద్దు చేసి అవకాశమే లేదని స్పష్టం చేశారు. రెవెన్యూ విషయంలో.. తెలంగాణను మిగతా రాష్ట్రాలు మోడల్‌గా తీసుకుంటున్నాయని గుర్తు చేశారు. ఏడాదిన్నరలో 90 శాతం గ్రామాల సర్వే పూర్తవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రెవెన్యూలో అవినీతి లేకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఆ క్రమంలోనే అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ట్రాప్‌లు అధికంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. తాను వచ్చాక ఏసీబీ ట్రాప్ అయిన ఫైల్స్ అన్ని క్లియర్ చేశానని తెలిపారు. గత ప్రభుత్వంలో మూడేళ్లు రెవెన్యూ ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. కానీ తాను వచ్చిన మూడు నెలల్లోనే 3,500 రెవెన్యూ ఫైల్స్ క్లియర్ చేశానని వివరించారు. అసెంబ్లీలో పెండింగ్‌లో ఉన్న 10 ఏళ్ల ఫైల్స్ ఆరు నెలల్లోనే క్లియర్ చేసినట్లు చెప్పారు. తనకు ఏ శాఖ కేటాయించినా.. కళ్లు మూసికొని పని చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మంచి జరిగే ఏ పని చేయడానికైన తాను భయపడనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుండబద్దలు కొట్టారు. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇండ్లకు రూ. 7 వేల కోట్లు చెలించామని చెప్పారు. రాష్ట్రంలో పాడి ప్రోక్యూర్‌మెంట్ 90 శాతం పూర్తయిందన్నారు. అసైన్డ్ భూములకు పాలసీ తీసుక వస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగినవని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం వాటిని నిషేధిత జాబితా (ప్రొహిబిటెడ్ లిస్ట్)లో చేర్చిందని మంత్రి పొంగులేటి వివరించారు.

## ఏదో ఒక రోజు ఆయన్ను కలుస్తా.. ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు

-మొదటిపేజీ తరువాయి

‘నేను మొజ్తాబా ఖమేనీని కలవాలనుకుంటున్నాను. అదంతా ఎలా కుదురుతుందో తెలీదు. కానీ ఏదో ఒక రోజు మేమిద్దరం కలుస్తాం‘ అని ఓ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ అణ్వాయుధాలను కలిగి ఉండకూడదని ఇప్పటికే అంగీకరించిందని.. అమెరికాతో చర్చల్లో ఖమేనీ పాల్గొంటున్నారని చెప్పుకొచ్చారు ట్రంప్.

**అందుకే అలా అన్నా..**

లెబనాన్ విషయంలో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూతో తీవ్ర వాగ్వాదం జరిగినట్లు ట్రంప్ అంగీకరించారు. లెబనాన్‌తో ఇజ్రాయెల్ చేస్తున్న పోరాటం పట్ల తాను సంతోషంగా లేనని ఆయన చెప్పారు. నెతన్యాహు.. లెబనాన్‌తో నిత్యం దాడులకు దిగడంపై తాను కలత చెందానని.. అందుకే ఆ సమయంలో మాట తూలానన్నారు. కాగా.. ఇటీవల ఇజ్రాయెల్ ప్రెసిడెంట్ నెతన్యాహుతో ఫోన్‌లో.. ‘నీకు పిచ్చి పట్టింది. నేను లేకపోతే నువ్వు జైల్లో ఉండేవాడివి. నేనే నిన్ను కాపాడుతున్నాను. ఇప్పుడందరూ నిన్ను, ఇజ్రాయెల్‌ను ద్వేషిస్తున్నారు‘ అని ట్రంప్ కోపంగా మాట్లాడినట్టు మీడియా కథనాలు నివేదించాయి. అయితే.. తనకు, నెతన్యాహుకు మధ్య మంచి సఖ్యత ఉందని ఆ అనుబంధాన్ని అగ్రరాజ్య అధ్యక్షుడు గుర్తుచేసుకున్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ చెలరేగిన నేపథ్యంలో ఇరాన్, అమెరికాల మధ్య సంప్రదింపులు దెబ్బతిన్నాయన్న వాదనలను ట్రంప్ ఖండించారు. కొన్ని రోజులుగా జోరుగా చర్చలు సాగుతున్నాయని ఆయన తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా పునరుద్ఘాటించారు. ‘ఈ చర్చలు ఎక్కడికి దారితీస్తాయో తెలియదు. కానీ నేను చెప్పినట్లుగా ఇరాన్ ఏదో ఓ విధంగా ఒప్పందం చేసుకోవాల్సిన సమయం వచ్చింది‘ అని ట్రంప్ పేర్కొన్నారు.

## విదేశీయుల వివరాలు 24 గంటల్లో ఇవ్వాలి: హైదరాబాద్ పోలీసుల హెచ్చరిక

-మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ నగరంలో బస చేసే విదేశీయుల వివరాలను 24 గంటల్లోగా తమకు తెలియజేయాలని నగర పోలీసులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్, 2025 ప్రకారం యజమానులకు, విద్యాసంస్థలకు తాజా అడ్వైజరీ జారీ చేశారు. నిబంధనలు పాటించని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గోల్కొండ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) జూన్ 3న ఈ సూచనలు జారీ చేశారు. హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లు, అద్దె ఇళ్ల యజమానులు, ఆసుపత్రులు, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు సహా విదేశీయులకు ఆశ్రయం కల్పించే వారందరూ ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. విదేశీ పాస్‌పోర్ట్ హోల్డర్లు, ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డు ఉన్నవారు, నేపాల్ జాతీయులతో సహా ఏ విదేశీయుడు తమ ప్రాంగణంలో బస చేసినా, నిర్దేశిత ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఫారం-III (ఫారం-సి) సమర్పించాలి. విద్యాసంస్థలు విదేశీ విద్యార్థుల వివరాలను ఫారం-IIలో నమోదు చేయాలి. వారు తిరిగి వెళ్లిన వివరాలను కూడా రిపోర్ట్ చేసి, ఆ రికార్డులను కనీసం ఏడాది పాటు భద్రపరచుకోవాలి. 2025 సెప్టెంబర్‌లో అమల్లోకి వచ్చిన కొత్త ఇమ్మిగ్రేషన్ చట్టం అమలులో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నట్టు పోలీసులు తెలిపారు. దేశంలో విదేశీయుల కదలికలపై పర్యవేక్షణను పటిష్టం చేయడమే దీని లక్ష్యం. తప్పుడు సమాచారం ఇచ్చినా లేదా వాస్తవాలను దాచిపెట్టినా చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని స్పష్టం చేశారు. ఎలాంటి చట్టపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకు అందరూ ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలని పోలీసులు కోరారు.

## తెలంగాణకు వ్యతిరేకంగా.. పవన్ ఎప్పుడూ మాట్లాడలేదు: రాంచందర్ రావు

-మొదటిపేజీ తరువాయి

పవన్ కల్యాణ్.. జనసేన సభ కోసం అనుమతి అడిగారని... ఇచ్చి ఉంటే కథ అక్కడే ముగిసేదని.. సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో కాంగ్రెస్ సర్కార్ చెప్పాలని రాంచందర్ రావు ప్రశ్నించారు. ఈ సమావేశం పెట్టుకోవడం ప్రతి ఒక్కరి ప్రజాస్వామ్య హక్కు అని చెప్పారు. దాన్ని అడ్డుకోవడమే ఎందుకు జరిగిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. పవన్ కల్యాణ్ అంశాన్ని బీజేపీ మీద రుద్దే ప్రయత్నం చేయడం రాజకీయ దివాళాకోరుతనమని ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కలిస్తేనే కొందరి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు.

**నిజాలు మాట్లాడాలి..**

తెలంగాణ సెంటిమెంట్ పేరుతో మళ్లీ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాంచందర్ రావు ఆగ్రహించారు. తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడిన వారితో చేతులు కలిపింది ఎవరో..? బీఆర్ఎస్ నేతలు చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని శక్తులతో అధికార రాజకీయాలు చేసింది ఎవరు..? అని నిలదీశారు. తెలంగాణను తిట్టిన వారిని, ఉద్యమకారులను అవమానించిన వారిని బీఆర్ఎస్‌లో చేర్చి పదవులు ఇచ్చింది ఎవరు..? అని ప్రశ్నించారు. తెలంగాణ పేరుతో రాజకీయాలు చేసే ముందు మీ రాజకీయ చరిత్రను ఒకసారి ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం మీద ప్రేమ ఉంటే డ్రామాలు కాదని... నిజాలు మాట్లాడాలని సవాల్ విసిరారు. ప్రజలు ఇప్పుడు భావోద్వేగాలకు కాదని, మీ గతానికి కూడా లెక్క అడిగే స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు.

**వారికి కేసీఆర్ హయాంలో మంత్రి పదవులు ఇచ్చారు..**

తెలంగాణను వ్యతిరేకించిన వారికి కేసీఆర్ హయాంలో మంత్రి పదవులు ఇచ్చారని రాంచందర్ రావు ఆగ్రహించారు. ఏపీలో బీఆర్ఎస్ ఆఫీస్ పెట్టలేదా..? అని ప్రశ్నించారు. తెలంగాణ నిధులను పంజాబ్‌లో కేసీఆర్ పంచలేదా..? అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించలేని పరిస్థితిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందని విమర్శించారు. బీజేపీ సపోర్ట్ చేయడంతోనే తెలంగాణ వచ్చిందని పేర్కొన్నారు.

**జాబ్ క్యాలెండర్ ఏమైంది..?**

కాంగ్రెస్ సర్కార్ ఇస్తానని చెప్పిన జాబ్ క్యాలెండర్ ఏమైంది..? అని రాంచందర్ రావు ప్రశ్నించారు. 12 ఏళ్ల నుంచి నీళ్ల మీద ఒక పాలసీ కూడా ఎందుకు తేలేదని నిలదీశారు. తెలంగాణకు రావాల్సిన నీళ్ల వాటా కంటే తక్కువ వాటాను కేసీఆర్ ఒప్పుకున్నారని ప్రస్తావించారు. రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాలను డీకే శివకుమార్‌కి.. రేవంత్‌రెడ్డి బహుమతిగా ఇచ్చారని విమర్శించారు. మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను అప్పుల్లోకి నెట్టారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ సూపర్ హీరో అని రాంచందర్ రావు అభివర్ణించారు.

# ప్రభుత్వ పాఠశాలలో నే నాణ్యమైన విద్య

**-జిల్లా విద్యాధికారి రాము**

జగిత్యాల జూన్ 04 తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని వారి సేవల ద్వారానే ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యా అందుతుందని జిల్లా విద్యాధికారి రాము అన్నారు.ఈరోజు భీమారం మండల్ లోని రంగాపూర్ లో ఈనెల మూడు నుండి 18 వరకు జరుగుచున్న జయశంకర్ బడిబాట ర్యాలీలో పాల్గొని అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు మరియు గ్రామ ప్రజలతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యతో పాటు సంస్కారం నేర్పబడుతుందని వారన్నారు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తో పాటు ఈ విద్యా సంవత్సరం ఉదయం అల్పాహారం అందించడం జరుగుతుందని అదేవిధంగా 9 రకాల వస్తువులతో కూడిన కిట్లు కూడా అందించబడతాయని,జిల్లా ఈ సంవత్సరం కొత్తగా 26 ప్రీ ప్రైమరీ పాఠశాల ప్రారంభిస్తున్నామని ఈ సంవత్సరం బాసర ట్రిబుల్ ఐటీ లో 126 మంది విద్యార్థులకు సీట్లు సాధించడం జరిగిందని నేడు సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న వారందరూ ఒకప్పుడు ప్రభుత్వ



పాఠశాలలో చదివిన వారేనని వారన్నారు అందుకని గ్రామ ప్రజలు అందరు సహకరించి విద్యార్థులందరిని ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని వారన్నారు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు బహుముఖ ప్రజ్ఞాశాలుగా తీర్చిదిద్దబడతారని వారన్నారు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్చి ప్రభుత్వ పాఠశాలను బలోపితం చేయాలనిన్నారు.అనంతరం బాసర ట్రిబుల్ ఐటీ లో సీట్ సాధించిన విద్యార్థికి గత విద్యా సంవత్సరం 10వ తరగతిలో 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థుల ను సన్మానించారు అనంతరం విద్యార్థులకు పిఆర్టి యు టి ఎస్ సంఘం సహకారంతో విద్యార్థులకు స్పోర్ట్స్ మెటీరియలను అందజేశారు అనంతరం ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల తో మాట్లాడారు



జిల్లా విద్యాధికారి ని గ్రామ ప్రజలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మకిలి కావేరి కుమార్,మండల విద్యాధికారి మధుసూదన్ రెడ్డి,పిఆర్టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయిని పెల్లి ఆనంద్ రావు,యాల్ల అమర్నాథ్ రెడ్డి,ఉప సర్పంచ్ బోయిని పెల్లి రాంమోహన్ రావు,మేడిపల్లి మండల విద్యాధికారి లక్ష్మి నరసయ్య,స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ వెంకట్ రమణ పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వప్న,సిఆర్పి బర్ల నారాయణ ఉపాధ్యాయులు వార్డు సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అభివృద్ధికి కేంద్రం భారీ వరం

**-జాతీయ రహదారుల విస్తరణతో ఉత్తర తెలంగాణకు కొత్త ఊపు.**

**-ఎంపీ అరవింద్ కృషితో రహదారుల అభివృద్ధికి నిధుల మంజూరు.**

**-భారతీయ జనతా పార్టీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ భోగ శ్రావణి.**

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) జూన్ 4

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి మరో కీలక నిర్ణయం తీసుకుందని భారతీయ జనతా పార్టీ జగిత్యాల నియోజకవర్గ బాధ్యురాలు డాక్టర్ భోగ శ్రావణి తెలిపారు. ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన జాతీయ రహదారుల విస్తరణకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం హర్షణీయమని ఆమె పేర్కొన్నారు. ఆర్మూర్--జగిత్యాల--మంచిర్యాల జాతీయ రహదారి జగిత్యాల--కరీంనగర్ జాతీయ రహదారిని నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఆమె వెల్లడించారు. వేల కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న ఈ పనుల ద్వారా ఉత్తర తెలంగాణలో రవాణా వ్యవస్థ మరింత బలోపేతం కానుందని తెలిపారు. ఇందుకు కృషిచేసిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి



అరవింద్ కు జిల్లా ప్రజల తరపున కృతజ్ఞ తలు తెలుపుతు న్నామని పేర్కొన్నారు.ఈ రహదారుల విస్తరణతో జగిత్యాల, కరీంనగర్, నిజామాబాద్, మంచిర్యాల ప్రాంతాల ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడ టంతో పాటు రవాణా సమయం తగ్గుతుందని ఆమె అన్నారు. రైతులు తమ పంటలను మార్కెట్లకు త్వరగా తరలించే అవకాశం కలుగుతుందని, వ్యాపార కార్యకలాపాలు వేగవంతమవుతాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి విశేష ప్రాధాన్యత ఇస్తున్నారని శ్రావణి తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానం మెరుగుప డటంతో ఆర్థికాభివృద్ధి వేగవంతమవుతోందని చెప్పారు. రహదారుల విస్తరణతో పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు పెరిగి యువతకు ఉపాధి లభిస్తుందని, పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఉత్తర తెలంగాణ అభివృద్ధిలో ఈ ప్రాజెక్టులు మైలురాయిగా నిలుస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ప్రతి ప్రాంతానికి సమాన అభివృద్ధి ఫలాలు అందేలా చర్యలు చేపడుతోందని భోగ శ్రావణి తెలిపారు.జాతీయ రహదారుల విస్తరణ తెలంగాణ ఆర్థిక ప్రగతికి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు ఎంతో దోహదపడుతుందని ఆమె అన్నారు.

# స్వచ్ఛత మనందరి బాధ్యత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇద్దాం

**-దమ్మపేట శ్రమదానంలో పాల్గొన్న అడిషనల్ డి.ఆర్.డి.ఓ రవికుమార్**

తెలంగాణ పత్రిక/దమ్మపేట(జూన్ 04)

ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5 పురస్కరించుకొని ముందస్తుగా గురువారం దమ్మపేట మండల కేంద్రంలో అడిషనల్ డి.ఆర్.డి.ఓ రవికుమార్, ఎం.పి.డి.వో రవీందర్ రెడ్డి, సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు ఆధ్వర్యంలో వీధుల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను పంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్తులు అందరూ కలిసి శ్రమదానం చేసి తొలగించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి రవికుమార్ మాట్లాడుతూ పర్యావరణానికి హాని చేసే సింగిల్ యూజ్ ప్లాస్టిక్





వాడకాన్ని పూర్తిగా బంద్ చేసే చర్యలు చేపట్టాలని పాలకవర్గం సభ్యులకు తెలియజేశారు. తను 2020వ సంవత్సరం దమ్మపేటలో ఎం.పి.డి.ఓ గా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు ప్లాస్టిక్ వాడకాన్ని కట్టడి చేశాం అని గుర్తు చేశారు. నీటి సంరక్షణ కొరకు ఇంకుడు గుంతల నిర్మాణం పై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ నర్సరీ మొక్కల పెంపకం అడిగి జూలై నెలలో మొక్కల పంపిణీ తో పాటు ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటాలి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బండి అనంత్ కుమార్, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, చాట్ల శ్రీనివాసరావు, గ్రామస్తులు చిన్నశెట్టి చిట్టిబాబు, శంకరవర అయ్యప్ప, పగడాల గోపి, పంచాయతీ సిబ్బంది, గణేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలి

**-రైతుల ఆవేదనకు స్పందించిన మేడిపల్లి సత్యం**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 04, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్పల్లి మండలం మానవాడ గ్రామంలోని ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రంలో గురువారం రైతులు తమ సమస్యలను స్టార్ 9 న్యూస్ జిల్లా స్టాపర్ గూడ రమేష్ కు తెలుపగా అక్కడ ఐకెపి సెంటర్ ను సందర్శించి అక్కడి సమస్యను తెలుసుకొని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చారవాణి ద్వారా రైతులతో మాట్లాడించారు. రైతులు ఎమ్మెల్యే తో మాట్లాడుతూ ఇప్పటివరకు వడ్ల కొనుగోలు ప్రక్రియ పూర్తిగా ప్రారంభం కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో కొనుగోలు ఆలస్యం అయితే తాము భారీ నష్టాలను చవిచూడాల్సి వస్తుందని రైతులు తెలిపారు. తమ వడ్లను వెంటనే కొనుగోలు చేసి ప్రభుత్వానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సమస్యలను తెలుసుకున్న మేడిపల్లి సత్యం వెంటనే స్పందించి అధికా రులతో మాట్లాడారు. రెం డు నుంచి మూడు రోజు ల్లో వడ్ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతుల ఇబ్బందులు తొలగి ంచేలా చర్యలు తీసుకో వాలని అధికారులకు సూ చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి రైతు తీసుకొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, ఒక్క గింజ కూడా మిగిలిపోకుండా ప్రభుత్వ



నిబంధనల మేరకు సేకరణ చేపడతామని రైతులకు హామీ ఇచ్చారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## ఈవీఎం గోడౌన్ తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) జూన్ 4

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రతి నెల ఈవీఎం లను తనిఖీ చేయడం జరుగుతుందని గోడౌన్ లోని యంత్రాల భద్రత, సిసి కెమెరాల పనితీరు, సాంకేతికపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించడం జరిగిందని తెలిపారు.గోదాము వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమైన భద్రత ఉండాలని, నిత్యం అప్రమత్తత తో పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు.ఈ పర్యవేక్షణలో అదనపు కలెక్టర్ బి.ఎస్ లత, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల అర్బన్ ఎమ్మార్వో రామ్మోహన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు, తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**-అపరెల్ పార్క్, గోదాముల్లో ధాన్యానికి అనుగుణంగా హమాలీల సంఖ్యను పెంచాలి**

**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**-ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 04, తెలంగాణ పత్రిక



జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు, తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు, అన్ లోడింగ్, వాహనాలు, ఇతర అంశాలపై పౌర సరఫరాల శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, సహకార శాఖ, మెప్మా, రవాణా శాఖ, వ్యవసాయ శాఖ, తదితర శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి గురువారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, హమాలీల సంఖ్య, గన్ని సంచులు, ఇప్పటివరకు ఎన్ని కొనుగోలు కేంద్రాలు మూసి వేశారు.. తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. అపరెల్ పార్క్, గోదాముల్లో ధాన్యానికి అనుగుణంగా హమాలీల సంఖ్యను పెంచాలని సూచించారు. కొనుగోళ్ల ప్రక్రియలో వేగం పెంచాలని ఆదేశించారు. కొనుగోళ్లు తుది దశకు చేరిన కేంద్రాల నుంచి హమాలీలు, వాహనాలను ఇతర కేంద్రాలకు తరలించాలని సూచించారు. ధాన్యానికి అనుగుణంగా ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాలు సమకూర్చాలని ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు, తరలింపు, అన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతంగా చేయాలని, అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

## కొడిమ్యాల ఫారెస్ట్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

జగిత్యాల జూన్ 04 తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని ఫారెస్ట్ కార్యాలయంలో గురువారం ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.80 వేల లంచం తీసుకుంటుండగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) మొయినొద్దీన్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం.ఫిర్యాదు మేరకు పక్కా ప్రణాళికతో వల పన్నిన ఏసీబీ అధికారులు,లంచం స్వీకరిస్తున్న సమయంలోనే అధికారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి సంబంధిత పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో కొడిమ్యాల ఫారెస్ట్ శాఖలో కలకలం రేగింది.కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా రవాణా అధికారి, ముఖ్య ప్రణాళిక అధికారి

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది జూన్ 04:



ములుగు జిల్లాలో జిల్లా రవాణా అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఠాకూర్ ఈశ్వర్ సింగ్, ములుగు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరించిన బి. సత్యనారాయణ రెడ్డి గురువారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావును కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తమ శాఖల పరిధిలో విధులను నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో గ్రామాభివృద్ధిపై చర్చ



ముధోల్:జూన్04(తెలంగాణ పత్రిక)

ముధోల్ మండల పరిధిలోని అష్ట గ్రామంలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గత 99 రోజుల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులపై గ్రామసభలో సమగ్రంగా చర్చించారు. గ్రామాభివృద్ధి, పచ్చదనం, పరిశుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలన, మొక్కల పెంపకం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపిఓ శివకుమార్ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు. అలాగే గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) శివకుమార్, బ్రహ్మాన్ గావ్ క్లస్టర్‌కు నూతనంగా నియమితులైన వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) రమేష్, పంచాయతీ కార్యదర్శి గంగాధర్, అంగన్‌వాడీ టీచర్లు దమయంతి, దేవిక, కొత్తూరు సుజాత, వాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్, ఉప సర్పంచ్ సురుగుల సావిత్ర కోటయ్య మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుంటూ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

## మజ్జిగ పంపిణీ చేస్తున్న దాతలను అభినందించిన వేముల మార్కండేయులు



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 04, తెలంగాణ పత్రిక

వేసవికాలంలో బాటసారులు, వివిధ గ్రామాల నుండి వచ్చే ప్రజలు, వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు మరియు ఎండలో అలసిపోయే వారికి దాహం తీర్చేందుకు శ్రీ రాజరాజేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థలను భారత్ నిర్మాణ వాలంటరీ వేముల మార్కండేయులు అభినందించారు.వడదెబ్బ కారణంగా పలువురు వృద్ధులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ సమయంలో “మానవ సేవయే మాధవ సేవ” అనే భావనతో ప్రజలకు ఉచితంగా మజ్జిగ అందిస్తూ సేవ చేస్తున్న దాతల సేవాభావం ప్రజలను ఆకట్టుకుంటోందని ఆయన పేర్కొన్నారు.గంగిశెట్టి శ్రీనివాస్, బెజవాడ నాగరాజు, ఉడ్నాల సత్యనారాయణ, డాక్టర్ జింక మహేందర్, చేపూరి నాగరాజు, నంగునూరు శ్రీకాంత్, లయన్ పోకల యాదగిరి, లయన్ సాయి కిషోర్ తదితర దాతలు గత నెల రోజులుగా మజ్జిగ తయారు చేసి గ్రామీణ ప్రజలకు అందిస్తూ వడదెబ్బ బారిన పడకుండా కాపాడుతున్నారని కొనియాడారు.ఈ సందర్భంగా చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు, భారత్ నిర్మాణ వాలంటరీ వేముల మార్కండేయులు దాతలకు ప్రత్యేక అభినందనలు, ధన్యవాదాలు మరియు కృతజ్ఞతలు తెలిపారు.”సొంత లాభం కొంత మానుకొని పొరుగువారికి తోడ్పడవోయ్” అని కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పినట్లు, సమాజం పట్ల బాధ్యతగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం ఎంతో ఆదర్శనీయమని ఆయన అన్నారు.భవిష్యత్తులో కూడా మరిన్ని స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి సమాజ సేవలో భాగస్వాములు కావాలని వేముల మార్కండేయులు పిలుపునిచ్చారు.

## ఘనంగా నర్రా కళ్యాణ్ జన్మదిన వేడుకలు

రాజేంద్రనగర్ ప్రతినిధి, జూన్ 04,తెలంగాణ పత్రిక.

సిపిఐ పార్టీ శంషాబాద్ మండల కార్యదర్శి నర్రగిరి కుమారుడు నర్రా కళ్యాణ్ 9 వ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. సందర్భంగా వారి నివాసంలో కుటుంబ సభ్యుల మధ్య కేక్ కట్ చేసిన కళ్యాణ్ కు కుటుంబ సభ్యులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు . కార్యక్రమంలో నర్రా యాదగిరి నర్రా జిలేబి శీను నర్రా రామారావు నర్రా బాబు నర్రా నరేష్ నరేష్ పాల్గొని నర్ర కల్యాన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## తెలంగాణపై విషం చిమ్మే ప్రయత్నాలు మానుకోవాలి: కంచర్ల రవి గౌడ్

-పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యానికి నిదర్శనం

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 04, తెలంగాణ పత్రిక



తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ అన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దానికి పైగా గడిచినా ఇంకా కొందరు నాయకులు తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, ఆత్మగౌరవాన్ని జీర్ణించుకోలేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆయన తీవ్రంగా ఖండించారు.తెలంగాణ అనేది ఎవరో ఇచ్చిన భిక్ష కాదని, వేలాది మంది విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, ప్రజలు చేసిన త్యాగాలు మరియు పోరాటాల ఫలితంగా సాధించుకున్న రాష్ట్రం అని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ చరిత్రపై అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు.రెండు తెలుగు రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం ఒక ఉప ముఖ్యమంత్రికి తగదని విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ పేరును ఉపయోగించుకోవడం మానుకోవాలని హితవు పలికారు. తెలంగాణ ప్రజలు తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం ఎలాగో బాగా తెలుసని, రాష్ట్ర గౌరవాన్ని కించపరిచే ఏ వ్యాఖ్యనైనా తీవ్రంగా ప్రతిఘటిస్తారని హెచ్చరించారు. పవన్ కళ్యాణ్ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.తెలంగాణ గౌరవం విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ముందుంటుందని కంచర్ల రవి గౌడ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మట్టి శ్రీనివాస్, అరెల్లి వినయ్ కుమార్, సాదు శేఖర్, బైకని వేణుగోపాల్ యాదవ్, బల్యాల ప్రవీణ్, కోడం వెంకటేశం, ఐదరి శశి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అట్టడుగు వర్గాల హక్కుల సాధనే లక్ష్యం

-వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభల ద పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 04, తెలంగాణ పత్రిక



తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి మహాసభల పోస్టర్‌ను గురువారం కామ్రేడ్ అమృతలాల్ శుక్ల భవన్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి గన్నెరం నర్సయ్య, జిల్లా నాయకులు అన్నల్ దాస్, గణేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం, కూలి రేట్ల పెంపు, ఉపాధి హామీ పథకంలో పని దినాల పెంపు, దళిత, గిరిజన వర్గాలపై జరుగుతున్న వివక్ష నిర్మూలన వంటి అంశాలపై మహాసభల్లో విస్తృతంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. మహాసభల్లో ప్రధానంగా ప్రస్తావించనున్న డిమాండ్లు వ్యవసాయ పనులకు గౌరవప్రదమైన కనీస వేతనాలు నిర్ణయించి గిట్టుబాటు కూలి కల్పించాలి.భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వ భూములను పంపిణీ చేయాలి. వ్యవసాయ కార్మికులందరికీ సామాజిక భద్రతా పథకాలను అమలు చేయాలి. ఉపాధి హామీ పథకాన్ని పటిష్టం చేసి కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించాలి. పని ప్రదేశాల్లో రోజుకు రెండు సార్లు ఫొటోలు తీయాల్సిన నిబంధనను రద్దు చేయాలి. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం రూ.26,000 చెల్లించాలి.రాబోయే రోజుల్లో నిర్వహించనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ హక్కుల సాధనకు సంఘటితంగా ముందుకు రావాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు సూరం పద్మ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఆడెపు రజిత తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం పరిశుభ్రత బాగుంటేనే ప్రజల ఆరోగ్యం బాగుంటుంది

-మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నాగేష్

మెదక్ జిల్లా చిన్న శంకరంపేట జూన్ 4:- తెలంగాణ పత్రిక




పారిశుద్ధ్యం పరిశుభ్రత బాగుంటేనే ప్రజల ఆరోగ్యం బాగుంటుందని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నాగేష్ గ్రామసభలో పేర్కొన్నారు. గురువారం మండలంలోని రుద్రారం గ్రామంలో 99వ ప్రణాళిక ప్రత్యేకగ్రామసభ సర్పంచ్ ఆకుల సంతోషి నవీన్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు అదనపు కలెక్టర్ నాగేష్ హాజరై మాట్లాడుతూ, గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికతో వెళ్లాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ అవగాహన ఉన్నప్పుడే ఆరోగ్యంగా జీవించగలమన్నారు. రైతులు అత్యుత్తోతమైన పంటలపై దృష్టి సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ తెలిపారు. రైతులకు అత్యంత పంటలపై డిజిటల్ శాటిలైట్ ద్వారా అవగాహన కల్పించారు. అలాగే గవ్వల పల్లి తండా లో సర్పంచ్ బానావత్ అనసూయ, జంగరాయి గ్రామంలో జిల్లా సర్పంచ్ ఫోరంల అధ్యక్షుడు సర్పంచ్ ఆవుల గోపాల్ రెడ్డి, మిర్జాపల్లి తండాలో సర్పంచ్ మూడవ కిషన్, ప్యాట గడ్డ, సర్పంచ్ రాతుల లావణ్య, రామాయపల్లిలో సర్పంచ్ బాగోన్నల రేణుక, టీ. మాందాపూర్ లో సర్పంచ్ మూడవ అశోక్ నాయక్ అధ్యక్షత ప్రత్యేక గ్రామసభలు జరిగాయి. ఈ గ్రామసభల్లో సురక్షిత సాగునీరుపై, జల సంరక్షణ, మన సంరక్షణ, మొక్కల పెంపకం, వనమహోత్సవం, హోటల్ జాబితా సమగ్ర సర్వే, రోడ్ల పారుశుద్ధ్యం వంటి ఏడు అంశాలపై గ్రామ సమస్యలపై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ మాలతీ, ఎంపీడీవో దామోదర్, ఏ ఎస్ ఓ ఇలియాస్, రాములు వసుదేవ్ జీసస్ వినోద్ కుమార్ లోకేష్ తదితర అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మెష్ డోర్లకు భలే గిరాకి

-గతంలో గాలి, వెలుతురుకు వాడేవారు
-నేడు కోతుల బెడద నుండి రక్షణ కొరకు
-పట్టణాలే కాకుండా పల్లెలకు విస్తరించిన డోర్లు
-తప్పిన కోతుల బెడద

మెదక్ జిల్లా చిన్నశంకరంపేట జూన్ 4:- (తెలంగాణ పత్రిక)



కోతుల పుణ్యమా అంటూ మెష్ డోర్లకు గిరాకీ విపరీతంగా పెరిగిపోయింది. గతంలో చల్లని గాలి, వెలుతురు కోసం మరియు దోమలు, ఈగలు ఇంట్లోకి రాకుండా ఈ మెష్ డోర్లను వాడేవారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో కోతుల బెడద నుండి తప్పించుకోవడానికి ఈ డోర్లను వాడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ మెష్ డోర్లను అల్యూమినియం, స్టీల్ లతో తయారుచేస్తారు. వీటిని ప్రధాన తలుపులకు బయట భాగంలో ఏర్పాటు చేస్తారు. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన ఈ మెష్ డోర్లు పల్లెలకు సైతం విస్తరించాయి. మెష్ డోర్లను ఏర్పాటు చేసుకోవడానికి ప్రధాన కారణం కోతుల బెడ ద. ఇంట్లో వెలుతు రు, గాలి కోసం తలుపు లను తెరిచి ఉంచడ ంతో కోతులు ఇంట్లోకి ప్రవేశించి నానా విధ్వ ంసం సృష్టించి అందిన కాడికి వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి. తలుపు తీసి ఉంచుదామా కోతుల బెడద.... పెట్టి ఉంచుదామా ఉక్కపోత, చీకటి.... ఈ కష్టాల నుండి తప్పించుకోవడానికి మెష్ డోర్ ప్రజలకు ఓ వరంల ఉపయోగం లోకి వచ్చింది. వీటిని కార్పెంటర్స్, ఇంజనీరింగ్ వర్క్స్ చేసేవాళ్లు తయారుచేసి అందిస్తున్నారు. ఒక మెష్ డోర్ కి సుమారు రూ.5 వేల నుండి రూ.7 వేల వరకు చార్జ్ చేస్తున్నారు. ఈ మెష్ డోర్ బిగించడంతో ఇంట్లోకి గాలి, వెలుతురు రావడమే కాకుండా కోతుల బెడద కూడా తప్పింది. ఈ డోర్లకి మ్యాగ్నెట్ బిగించడంతో బయట నుండి లోపలికి లోపటి నుండి బయటికి సునాయాసంగా రాకపోకలు సాగించవచ్చు. మ్యాగ్నెట్ గట్టిగా పట్టుకోవడంతో కోతులకు వాటిని తీసే శక్తి, ఉపాయం లేకపోయింది. ఈ డోర్లతో కోతుల బెడద 100% తప్పిందని, కోతులకు భయపడకుండా ఇంట్లోనే ప్రశాంతంగా ఉంటున్నామని వీటిని వాడుతున్న ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

## నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా విద్యాశాఖాధికారికి ఘన సన్మానం

-నూతన డీఈఓ ను సన్మానించిన ట్రస్మా

చండూర్ తెలంగాణ పత్రిక జూన్ 4



నల్గొండ జిల్లా నూతన జిల్లా విద్యాశాఖాధికారిగా (డీఈవో) బాధ్యతలు స్వీకరించిన సుశీందర్ రావు గారిని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం నల్గొండ డీఈవో కార్యాలయంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా ట్రస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులు, మాట్లాడుతూ, జిల్లా విద్యాభివృద్ధికి డీఈవో సుశీందర్ రావు గారి నాయకత్వంలో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టి విద్యారంగం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారంలో కూడా సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలను రెండింటిని సమానంగా చూడాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడే ప్రైవేట్ పాఠశాల నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర నాయకులు కందాల పాపిరెడ్డి, ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి జీ.వీ. రావు, జిల్లా కోశాధికారి మట్ట చెన్నయ్య గౌడ్, కార్పొరేటర్ గంట్ల అనంతరెడ్డి ట్రస్మా నాయకులు పుచ్చకాయల వెంకటరెడ్డి, నల్లగొండ టౌన్ ప్రెసిడెంట్ అజీజ్, శంభు లింగారెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకట్ రెడ్డి, కన్నయ్య, శ్రీనివాస్, కనయ్య, రామకృష్ణ, గొట్టిపర్తి చంద్రశేఖర్, మట్ట అంజన్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, జంగయ్య గౌడ్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొని నూతన డీఈవో గారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో నిర్వహించబడగా, జిల్లా విద్యాభివృద్ధికి పరస్పర సహకారంతో ముందుకు సాగాలని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు.

# అర్హత కలిగిన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

**నంగునూరు, జూన్ 4(తెలంగాణ పత్రిక):**

పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి ప్రభుత్వం నివాసాన్ని కల్పిస్తోందని నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ మాజీ అధ్యక్షుడు, ఏఎంసీ డైరెక్టర్ ఎం.డి.ఇమ్రాన్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని వారు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని తిమ్మయిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తగా నిర్మించిన ఇళ్లలోకి ప్రవేశించిన లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. ఇంటి యజమానులను అభినందించి వారిని శాలువాతో సన్మానించారు. కొత్త ఇంట్లో ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు



ఉండాలన్న సంకల్పంతో ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటానికి గృహ వసతి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. సొంతింటి కల నెరవేరినప్పుడు కుటుంబ సభ్యుల ముఖాల్లో కనిపించే ఆనందం తమకు మరింత సంతృప్తిని ఇస్తుందని చెప్పారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని, పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పిల్లి పద్మ-నర్సింలు, చెప్యాల లావణ్య-రవి మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సొంతింటి కల నెరవేరిందని హర్షం వ్యక్తం చేశారు. తమకు ఇల్లు మంజూరు చేసి కలను సాకారం చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



ఇకపై సొంత గృహంలో కుటుంబంతో కలిసి సంతోషంగా జీవిస్తామని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తిమ్మాయిపల్లి సర్పంచ్ చేర్యాల రాజు, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రంగు అశోక్ గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు వల్లాద్రి రవీందర్ రెడ్డి, మోతుకు లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మల్యాల తిరుపతి, నాయకులు చెప్యాల అమరేశ్, పంచాయతీ కార్యదర్శి పల్లె తిరుపతి, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# టి-ఫైబర్ పరికరాల దొంగతనాల మిస్టరీ ఛేదించిన జగిత్యాల రూరల్ పోలీసులు

**-రూ.4.52 లక్షల విలువైన 39 బ్యాటరీలు, 4 యూపీఎస్‌లు స్వాధీనం**
**-ముగ్గురు నిందితుల అరెస్ట్**

**జగిత్యాల జూన్ 04 తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి**

గత కొంతకాలంగా గ్రామపంచాయతీ భవనాల్లో ఏర్పాటు చేసిన టి-ఫైబర్ పరికరాలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న వరుస దొంగతనాల కేసులను జగిత్యాల రూరల్ పోలీసులు ఛేదించారు.ఈ కేసులకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కి తరలించి ,వారి వద్ద నుంచి సుమారు రూ.4.52 లక్షల విలువైన దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు జగిత్యాల రూరల్ సి.ఐ సుధాకర్ తెలిపారు. జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల దర్యాప్తులో భాగంగా గురువారం ఉదయం ధరూర్ గ్రామ శివారులోని జగిత్యాల బైపాస్ రోడ్డుపై అంబేద్కర్ విగ్రహం సమీపంలో పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా వెళ్తున్న TG21T1774 నంబరు గల ఆటో రిక్షాను తనిఖీ చేయగా, అందులో భారీ సంఖ్యలో బ్యాటరీలు, యూపీఎస్ పరికరాలు లభ్యమయ్యాయి. వెంటనే ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా, టి-ఫైబర్ పరికరాల దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారు. పోలీసుల విచారణలో ప్రధాన నిందితుడు బండ అంజయ్య గతంలో టి-ఫైబర్‌కు అనుబంధ సంస్థ అయిన స్టెర్‌లైట్ టెక్నాలజీస్ లిమిటెడ్‌లో డ్రైవర్‌గా, అనంతరం టెక్నీషియన్‌గా పనిచేసినట్లు వెల్లడైంది. ఉద్యోగం మానేసిన అనంతరం గ్రామపంచాయతీ భవనాల్లోని టి-ఫైబర్ బ్యాటరీలు, యూపీఎస్‌లను దొంగిలించాలనే పథకాన్ని రూపొందించి, తన సహచరులు మండలి రవి,చెమేల్ల నరేష్‌లకు తెలిపాడు.ముగ్గురు కలిసి గత నెల రోజులుగా ధర్మారం, లక్ష్మీపూర్, తిమ్మాపూర్, కల్లెడ, సంగంపల్లి, హన్మాజీపేట, అనంతారం, గుట్రాజ్‌పల్లి, అంతర్గాం, గొల్లపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన టి-ఫైబర్ పరికరాలను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడినట్లు ,దొంగిలించిన బ్యాటరీలు,యూపీఎస్‌లను



ఆటోలో తరలించి ఒకచోట నిల్వ చేసి, విక్రయించేందుకు తీసుకెళ్తున్న సమయంలో పట్టుకున్నట్లు జగిత్యాల రూరల్ సిఐ సుధాకర్ తెలిపారు.

**అరెస్టు చేసిన నిందితుల వివరాలు**

బండ అంజయ్య (36), లక్ష్మీపూర్ గ్రామం
మండలి రవి (49), లక్ష్మీపూర్ గ్రామం
చెమేల్ల నరేష్ (38), లక్ష్మీపూర్ గ్రామం

**స్వాధీనం చేసుకున్న సొత్తు**

HBL OPTIMUZ SMF VRLA 12V 95Ah బ్యాటరీలు -- 14
EXIDE POWER SAFE PLUS 12V 65Ah బ్యాటరీలు -- 21
EXIDE POWER SAFE PLUS 12V 42Ah బ్యాటరీ -- 1
TUNWAL E-VEHICLE 12V 32Ah బ్యాటరీలు -- 3
UPS పవర్ సప్లయర్లు -- 4
బజాజ్ ప్యాసింజర్ ఆటో (TG21T1774)

# రేపు ఇంచర్ల అర్బన్ పార్కులో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు

**- అటవీ శాఖ ఆధ్వర్యంలో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యాచరణ**
**- ముఖ్య అతిథులుగా హాజరుకానున్న ప్రజాప్రతినిధులు, అధికారులు**

**తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది జూన్ 04:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' లో భాగంగా ములుగు జిల్లాలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో జూన్ 1 నుండి జూన్ 12 వరకు ప్రత్యేక పర్యావరణ ఇతివృత్త కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఇందులో భాగంగా జూన్ 5 (రేపు)



ఉదయం 7:30 గంటలకు ములుగు జిల్లాలోని ఇంచర్ల అర్బన్ పార్క్ వేదికగా ఈ ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. ఈ పర్యావరణ మహోత్సవానికి జిల్లాలోని ప్రముఖ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. పర్యావరణ పరిరక్షణ, అడవుల విస్తరణ, మరియు ప్రకృతి సమతుల్యతను కాపాడటంపై ఈ సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు మరియు మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టనున్నారు. హ్యూమన్ - వైల్డ్‌లైఫ్ కన్ఫ్లిక్ట్ లో నష్ట పోయిన వారికి చెక్కుల పంపిణీ, పర్యావరణ హిత జ్యూట్ బ్యాగుల పంపిణీ చేయబడుతుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా ములుగు జిల్లా అటవీ శాఖ అధికారులు కోరారు.

# ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

**-ప్రైవేట్ వద్దు గవర్నమెంట్ ముద్దు**

**తానూర్: 04జూన్ (తెలంగాణ పత్రిక)**

బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అయ్యూబ్ సూచించారు. గురువారం మండలంలోని కోలూరు గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం లోని భాగంగా "ప్రైవేటు వద్దు- గవర్నమెంట్ "ఏ ముద్దు అనే నినాదంతో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం కల్పిస్తున్నటువంటి నాణ్యమైన విద్య బోధన, పౌష్టికాహారం,ఉచిత పాఠ్య పుస్తకలు,యూనిఫారాలు, తదితర, సౌకర్యాలను గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలని, ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చేరేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాధవరావు, ఉపాధ్యాయులు,గ్రామ పెద్దలు ,యువకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా నర్రా కళ్యాణ్ జన్మదిన వేడుకలు



**రాజేంద్రనగర్ ప్రతినిధి, జూన్ 04,తెలంగాణ పత్రిక.**

సిపిఐ పార్టీ శంషాబాద్ మండల కార్యదర్శి నర్రగిరి కుమారుడు నర్రా కళ్యాణ్ 9 వ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. సందర్భంగా వారి నివాసంలో కుటుంబ సభ్యుల మధ్య కేక్ కట్ చేసిన కళ్యాణ్ కు కుటుంబ సభ్యులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు . కార్యక్రమంలో నర్రా యాదగిరి నర్రా జిలేబి శీను నర్రా రామారావు నర్రా బాబు నర్రా నరేష్ నరేష్ పాల్గొని నర్ర కల్యాన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## కామారెడ్డిలో బీఆర్ఎస్ భారీగాతరలివచ్చిన పార్టీ శ్రేణులు

**కామారెడ్డి, జూన్ 4,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**

ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్‌ఆధ్వర్యంలో జరిగిన కామారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు విస్తృతస్థాయి సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు. కార్యకర్తల అపూర్వ స్పందన, పార్టీ పట్ల ఉన్న అంకితభావం సమావేశాన్ని విజయవంతం చేయడమే కాకుండా కామారెడ్డి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలం, ప్రజాదరణ ఏమాత్రం తగ్గలేదని మరోసారి స్పష్టంచేసింది. ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల అండదండలతో బీఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతం అవుతూ తిరిగి ప్రజాసేవలో కీలక పాత్ర పోషించేందుకు సిద్ధమవుతోందని ఈ సమావేశం చాటిచెప్పింది. రానున్న రోజుల్లో మరింత ఉత్సాహంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేశారు.

## పాదయాత్రతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు పొందిన దంపతులు

**కామారెడ్డి ,జూన్ 4, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**

కామారెడ్డి జిల్లా జిబి పేట మండల కేంద్రానికి చెందిన శ్రీమతి ఏల్లమైన నందిని తమ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు విషయంలో ఏర్పడిన సమస్యపై జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పాదయాత్రగా బయలుదేరిన విషయం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులు దరఖాస్తును పరిశీలించారు. పరిశీలనలో, రెండో విడత లబ్ధిదారుల జాబితాలో పేరు ఉన్నప్పటికీ సాంకేతిక కారణాల వల్ల ఆన్‌లైన్‌లో వివరాలు కనిపించకపోవడం గుర్తించారు. వెంటనే సమస్యను పరిష్కరించి, లబ్ధిదారురాలికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు ప్రక్రియను పూర్తి చేశారు. అదేవిధంగా, ఇంటి నిర్మాణానికి అవసరమైన మార్కౌట్ ప్రక్రియను కూడా పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం లబ్ధిదారురాలి సమస్య పూర్తిగా పరిష్కారమైందని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని పేర్కొన్నారు.

## అనారోగ్య బాధితుడికి రూ.2.15 లక్షల ఎల్ఓసి మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 04, తెలంగాణ పత్రిక**

రాజన్న సిరిసిల్ల జిల్లా గోపాల్‌నగర్‌కు చెందిన రాపల్లి దేవదాస్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ అత్యవసర వైద్య చికిత్స అవసరమైన విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వెంటనే స్పందించారు.బాధితుడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన ఆయన, హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి వైద్యులతో నేరుగా మాట్లాడి ప్రత్యేక వైద్య చికిత్స అందేలా చర్యలు చేపట్టారు. అలాగే వైద్య




ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నుంచి రూ.2,15,000 విలువైన ఎల్ఓసి (లెటర్ ఆఫ్ క్రెడిట్)ను అత్యవసరంగా మంజూరు చేయించారు.ఆది శ్రీనివాస్ చొరవతో చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం అందడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. క్లిష్ట సమయంలో అండగా నిలిచి తక్షణ సహాయం అందించిన రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే ఆది శ్రీనివాస్, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అవసరమైన వైద్య సహాయం అందించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని స్థానికులు పేర్కొన్నారు.

# రజతోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 04 (తెలంగాణ పత్రిక):

కొండపాక మండలంలోని మర్పడగ గ్రామంలోని శ్రీ విజయ దుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రం నందు నిర్వహించిన సహస్ర బ్రాహ్మణ సువాసిన్యర్చన ( రజతోత్సవం) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి పాల్గొన్నారు. శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి గారు, శ్రీశ్రీశ్రీ వెదురుపాక గాడ్ గారు, చెప్యాల హరినాథ శర్మ వారి ఆధ్వర్యంలో వేద పండితులు, గానా బజానాలతో, దైవత్వం ఉట్టిపడేలా కార్యక్రమం అంగరంగ వైభవంగా ఒక పండుగ వాతావరణం లో నిర్వహించారు. దాదాపు జిల్లా నుండి 1200 మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారు ఆశీర్వచనాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామిగల్ చరవాణి ద్వారా వీక్షించి ఇంతటి మహోన్నత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన ప్రతి ఒక్కరికి దివ్యాశీస్సులు తెలియజేశారు.

# డయాగ్నస్టిక్ సెంటర్లను తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతి కుమార్



మంగపేట, జూన్ 04 ( తెలంగాణ పత్రిక):

మంగపేట మండల కేంద్రంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. క్రాంతి కుమార్, మంగపేట పిహెచ్ సి డా. అఖిల సంయుక్తంగా గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్థానికంగా ఉన్న పలు ప్రైవేట్ డయాగ్నస్టిక్ ల్యాబ్‌లను సందర్శించిన అధికారులు.. ల్యాబ్ నిర్వహణకు సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, ఓపీ రిజిస్టర్లు, మరియు ల్యాబ్ సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పలు లోపాలను అధికారులు గుర్తించారు. స్పందించిన డిప్యూటీ డీఎంహెచ్ఓ, నిబంధనలు పాటించని సదరు డయాగ్నస్టిక్ ల్యాబ్‌లకు తక్షణమే నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ల్యాబ్‌లు నిర్వహించకపోతే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

# వీణవంక లో జెసిబి సహాయంతో డ్రైనేజీని శుభ్రపరచిన వార్డు సభ్యురాలు ఓరేం అనూష- అవినాష్

-వెంటనే స్పందించిన వార్డు మెంబర్ ను ప్రశంసిస్తున్న గ్రామ ప్రజలు..

వీణవంక ప్రతినిధి, జూన్ 4( తెలంగాణ పత్రిక).



వీణవంక మండల కేంద్రంలో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి డ్రైనేజీలో వరద నీరు పారడంతో చెత్తాచెదారం తట్టి, ఒక్కసారిగా గృహ సముదాయాలకు వరద నీరు రావడంతో వెంటనే స్పందించిన 11వ వార్డు సభ్యురాలు ఓరేం అనూష- అవినాష్ మానవత్వంతో స్పందించి, సొంత ఖర్చులతో జెసిబి సహాయంతో డ్రైనేజీని శుభ్రపరిచి వర్షం నీటిని పంపించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ... గ్రామంలోని వర్షం కురవడంతో షాహిన్ మీసేవ సెంటర్ నుండి డ్రైనేజీ కాలువలో వరద నీరు అధికంగా కలిసిపోయి, ఎస్సీ కాలనీ వరకు వరద ప్రవాహం పెరిగి, డ్రైనేజీ కాలువలో చెత్తాచెదారం వల్ల మురుగునీరు సరిగా వెళ్లక, చెత్త అడ్డు రావడం వల్ల, వర్షపు నీరు ఇండ్లలోకి రావడం జరుగుతుందని, కొన్నిచోట్ల డ్రైనేజీ పాక్షికంగా దెబ్బ తినడంతో వరద నీరు పోవడానికి ఇబ్బంది కలగడంతో,జెసిబీ సహాయంతో వరద నీటికి అడ్డుగా ఉన్న చెత్తను తొలగించడం జరిగిందని అన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న వేళ డ్రైనేజీ కాలనీ మరోమారు శుభ్రపరచి, రోగాల నియంత్రణకు బ్లీచింగ్ చేయడానికి అధికారులు సహకరించాలని కోరారు. వరద నీటిని తొలగించిన వార్డు సభ్యురాలను,వార్డు ప్రజలు ప్రశంసిస్తూ, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కర్ణంగూడను జిల్లాకు ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి

-రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి, కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

-ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభలో గ్రామాభివృద్ధిపై దిశానిర్దేశం

రంగారెడ్డి జిల్లా, జూన్ 04,(తెలంగాణ పత్రిక)





ఇబ్రహీంపట్నం మండలం కర్ణంగూడ గ్రామాన్ని జిల్లాకు ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి గ్రామస్థుడు భాగస్వామి కావాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని గ్రామాభివృద్ధి, వ్యవసాయం, పారిశుద్ధ్యం, విద్య, పర్యావరణ పరిరక్షణ, ఓటరు జాబితా పునర్విమర్శ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని, రైతులు వ్యవసాయ శాఖ సూచనల మేరకు పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. అధిక నీటి అవసరమున్న వరి సాగుపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని, వర్షాలు ఆలస్యమయ్యే పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని కోరారు. వర్షాకాలంలో అంటువ్యాధుల నివారణకు గ్రామ పరిశుభ్రత అత్యంత కీలకమని పేర్కొన్న ఆయన, చెత్తాచెదారం పేరుకుపోకుండా ప్రతి కుటుంబం బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గ్రామంలో నీటి కాలుష్యం, దోమల వ్యాప్తి నివారణకు ప్రజల సహకారం అవసరమన్నారు. వర్షాలు ప్రారంభమైన వెంటనే గ్రామంలో విస్తృత స్థాయిలో మొక్కలు నాటాలని, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని తెలిపారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఘన వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచాలని సూచించిన కలెక్టర్, తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయవచ్చని, పొడి చెత్తను రీసైక్లింగ్ ద్వారా తిరిగి వినియోగించవచ్చని వివరించారు. గ్రామస్థుల అభ్యర్థన మేరకు చెత్త సేకరణ డబ్బాలను అందజేస్తామని, వాటిని సమర్థవంతంగా వినియోగించి కర్ణంగూడను జిల్లాకు ఆదర్శ గ్రామంగా నిలబెట్టాలని కోరారు. నెల రోజుల తర్వాత గ్రామంలోని ఘన వ్యర్థాల నిర్వహణ పరిస్థితిని స్వయంగా సమీక్షిస్తామని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంపోస్ట్ యూనిట్‌ను పూర్తిస్థాయిలో వినియోగించి సేంద్రియ వ్యర్థాలను విలువైన ఎరువుగా మార్చాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. రైతులకు ఎరువుల పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తోందని అధికారులు వివరించారు. యూరియా, డీఏపీ తదితర ఎరువుల పంపిణీ ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా జరగనున్నందున రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. భూమి విస్తీర్ణం, సాగు చేస్తున్న పంటల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, తప్పుడు వివరాలు నమోదు చేస్తే ఎరువుల కేటాయింపులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టనున్న ప్రత్యేక ఓటరు జాబితా పునర్విమర్శ కార్యక్రమంలో ప్రతి అర్హుడి పేరు నమోదు అయ్యేలా ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. అవసరమైన ధ్రువపత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల పునఃప్రారంభానికి గ్రామస్థుల సహకారం అవసరం కర్ణంగూడలో మూతపడిన ప్రాథమిక పాఠశాలను తిరిగి ప్రారంభించేందుకు గ్రామస్థులు ముందుకు రావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. చిన్నారులను దూర ప్రాంతాలకు పంపకుండా గ్రామంలోనే విద్య అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు ప్రభుత్వం ద్వారా అందజేయబడతాయని వివరించారు. ఈ సందర్భంగా డీసీపీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా ప్రజలు రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. తాగి వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో కుటుంబ పోషకులు ప్రాణాలు కోల్పోతుండటం ఆందోళనకరమన్నారు. యువతలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల వినియోగం గమనిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిరుమల రెడ్డి, ఉపసర్పంచ్, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రైతులు, మహిళలు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు..

# ఎల్కపల్లి, యశ్వంతరావుపేట్ వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయం

-తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులు

-పట్టించుకోని అధికారులు

వెల్దుర్తిమండల ప్రతినిధి,జూన్04 (తెలంగాణ పత్రిక):



వెల్దుర్తి మండల మండల కేంద్రం నుండి ఎల్కపల్లి, యశ్వంతరావుపేట్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై కంకర తేలిపోవడంతో వాహనదారులు, రైతులు, విద్యార్థులు నిత్యం ప్రమాదాల భయంతో ప్రయాణాలు సాగిస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామాల మధ్య రాకపోకలకు కీలకంగా ఉన్న ఈ రహదారి గత కొంతకాలంగా అధ్వాన్న స్థితికి చేరుకుంది. చిన్నపాటి వర్షం కురిసినా రహదారిపై గుంతల్లో నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గం ద్వారా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలిస్తుంటారు. అయితే రహదారి దుస్థితి కారణంగా వ్యవసాయ సరుకుల రవాణా కూడా కష్టసాధ్యంగా మారిందని రైతులు పేర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు కూడా వేగంగా వెళ్లలేని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ప్రతిరోజూ ఈ రహదారిపైనే ప్రయాణించాల్సి వస్తుండటంతో వారి తల్లిదండ్రులు కూడా ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రహదారిని పరిశీలించి తక్షణమే మరమ్మతులు చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగించాలని ఎల్కపల్లి, యశ్వంతరావుపేట్ గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రహదారి అభివృద్ధి పనులు చేపట్టి సురక్షిత ప్రయాణానికి మార్గం సుగమం చేయాలని ఎల్కపల్లి, యశ్వంతరావుపేట్ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# నేడు శుక్రవారం పోచాపూర్,లింగాల గ్రామాల్లో ప్రజా దర్బార్ కార్యక్రమం

-జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది జూన్ 04:



రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను స్థానికంగానే తెలుసుకొని పరిష్కరించే విధంగా గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడ్వాయి మండలం పోచాపూర్ గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో బిట్టుపల్లి, బంధాల, పోచాపూర్, నర్సాపూర్ పిఎల్,బోల్లెపల్లి గ్రామాల ప్రజలకు శుక్రవారం ఉదయం 9:00 గంటలకు, లింగాల గ్రామంలోని గ్రామపంచాయతీలో ఒడ్డుగూడెం, అల్లిగూడెం, లింగాల, బోటి లింగాల, లవ్వల గ్రామాల ప్రజలకు 10:00 గంటలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కార మార్గం చూపడానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సమక్షంలో తాడ్వాయి మండలంలోని పోచపూర్, లింగాల గ్రామాలలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, రెండు గ్రామాల పరిధిలోని ఫిర్యాదుదారులు తమ స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన విన్నపాలను ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలపై దరఖాస్తులను అందజేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ప్రజా దర్బార్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ, డీఎఫ్ఓ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, ఆర్డీఓ, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని శాఖల ఇంజనీరింగ్ ఉన్నత అధికారులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

# లక్నవరం సరస్సును సందర్శించిన జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది జూన్ 04:

గోవిందరావుపేట మండలం లక్నవరం సరస్సును గురువారం జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లక్నవరం సరస్సు పరిసర ప్రాంతాలను, ఉయ్యాల వంతెన, పర్యాటకులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, త్రాగునీరు, మరుగుదొడ్లు, పరిశుభ్రత, బోటింగ్ భద్రతా వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



# గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక







-రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలి.
-జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు.

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది జూన్ 04:

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని, రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని,ఉపాధి హామీ పథకంలో ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు అన్నారు. 99 రోజుల ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వెంకటాపూర్ మండలం కేశవాపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు పాల్గొని గ్రామ ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలను సందర్శించి గ్రామాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామసభలో ప్రజలు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తామని, డీఆర్‌డీఏ, ఎంపీడీవోలు, ఎంపీఓల సమన్వయంతో జిల్లా స్థాయిలో జాబ్ క్యాలెండర్ రూపొందిస్తామని తెలిపారు. తాగునీటి ట్యాంకు నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు అందించే పథకాల ప్రయోజనాలు సకాలంలో అందాలంటే నమోదు కీలకమని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతు వేదికల ద్వారా రైతులకు పూర్తి సహకారం అందుబాటులో ఉంటుందని చెప్పారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రజలు అధికంగా పాల్గొనాలని, ఉపాధి పనుల్లో కార్మికుల భాగస్వామ్యం పెరిగితే గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీఓ భవనాలు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరింత నిధులు లభించే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ వెంకయ్య, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# వీణవంక లో తొలకరి పలకరింపుతో ప్రారంభమైన పునాస సాగు

-పుడమితల్లి పులకింత... ఆనందంలో అన్నదాతలు...
-పునాస మొదలైన మొదలుకాని కల్వల ప్రాజెక్ట్, వీణవంక చెరువు మరమ్మత్తులు...

వీణవంక ప్రతినిధి,జూన్ 4( తెలంగాణ పత్రిక).





రోహిణి కార్తె మొదలైనప్పటి నుండి దుక్కులు దున్నుకొని వర్షం కోసం ఎదురు చూస్తున్న అన్నదాతలకు గురువారం సాయంత్రం తొలకరి జల్లుతో పుడమితల్లి పులకింతతో అన్నదాతల ఆనందానికి అవధులు లేవు. అన్నదాతలు దుక్కులను దున్ని, దమ్ము చేసి, పత్తి గింజలు పెట్టేందుకు అచ్చు తోలి తొలకరి జల్లు కోసం వారం రోజులుగా ఎదురుచూస్తున్న రైతులకు తొలకరి జల్లు పలకరింపుతో పుడమి తల్లి పులకరించి, పునాస పనులు మొదలయ్యాయి. రైతులు పత్తి గింజలు పెట్టేందుకు కొంతమంది రైతులు సమయత్వం కాగా, మరి కొంతమంది రైతులు దుక్కులను దున్ని, విత్తనం నాటేందుకు వ్యవసాయ పనుల్లో నిమగ్నం కానున్నారు. ఈసారి వాతావరణ శాఖ ఏలినీలో ప్రభావంతో వర్షాలు తక్కువే కురుస్తాయని, జూన్ 10 తర్వాత వర్షాలు వస్తాయని సూచించినప్పటి నుండి రైతులు కొంత నిరాశతో దుక్కులు రెడీ చేయడంలో వెనుకంజలో ఉన్నారు. కానీ, వ్యవసాయ అధికారులు వరి పంటలను తగ్గించి, ఆరుతడి పంటలైన మొక్కజొన్న, పత్తి, పొగాకు, వేరుశనగ, శనగ, పసుపు, కూరగాయలు లాంటి పంటలను పండించి, భూములను రక్షించాలని, అలాగే వాణిజ్య పంటలతో అధిక లాభాలు పొందవచ్చు అని అధికారులు సూచనలు చేస్తున్నారు. వ్యవసాయ పంటలకు నీరు తక్కువగా ఉన్న భూములలో పామాయిల్ పండించి అధిక లాభాలు పొందవచ్చని హార్టికల్చర్ అధికారులు సూచిస్తున్నారు. కానీ, రైతులు నల్లరేగడి భూములలో సీజన్లో పత్తి వేసే, రబీ సీజన్లో మొక్కజొన్న వేసి అధిక లాభాలను పొందడం జరుగుతుంది. చెరువు ఆధారిత సాగుభూములలో ఎక్కువ శాతం వరి ఏసేందుకే మక్కువ చెబుతున్నారు.ఎందుకంటే చెరువు వెనుక భూములలో తేమశాతం ఎక్కువగా ఉండి, నేల చౌడుగా మారడంతో మొక్కలు సరిగా ఎదగక, గిడసబారిపోయి పంటకు తీవ్ర నష్టం ఏర్పడుతుంది. కావున రైతులు వరి ఎక్కువగా వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కానీ, వీణవంక మండల కేంద్రంలో పంట పొలాలు కల్వల ప్రాజెక్ట్, వీణవంక చెరువు ఆధారంతోనే రైతన్నలు ఖరీఫ్, రబీ సీజన్లో వరి పంటలు పండించి ఆధునాతనమైన పద్ధతులలో అధిక లాభాలు పొందడం జరుగుతుంది. కానీ, ఈ సంవత్సరం కూడా కలువల ప్రాజెక్టు మరమ్మత్తు చేయకపోవడం వల్ల చెరువు వెనుక వ్యవసాయ భూములు బీడులుగా మారడం ఖాయంగా కనిపిస్తుంది. అలాగే వీణవంక చెరువు తూముల మరమ్మతు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన, ఇంతవరకు మరమ్మతులు చేపట్టకపోవడం ఆలోచించదగ్గ విషయమని రైతులు ఆవేదన వ్యక్తపరుస్తూ, ఈసారి రెండు చెరువుల వెనుక సాగునీరు లేక వ్యవసాయ పంట పొలాలు బీడులుగా మారనున్నాయని రైతులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.ప్రజా ప్రతినిధులు,అధికారులు వెంటనే మేల్కొని, కలువల ప్రాజెక్ట్, వీణవంక చెరువు మరమ్మతులు చేపట్టి, జీవధారమైన చెరువులను రక్షించి, అన్నదాతలను కాపాడాలని కోరుతున్నారు

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' గ్రామసభ విజయవంతం

-ముఖ్య అతిథిగా హాజరైన నల్గొండ జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్
-ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచితేనే గ్రామాభివృద్ధి: కలెక్టర్
-ప్లాస్టిక్ నిషేధానికి స్టీల్ సామాగ్రి విరాళం ఇచ్చిన ఉపసర్పంచ్‌కు అభినందనలు
-'అమ్మ పేరుతో ఒక మొక్క' (మా కే నామ్ పర్ ఏక్ పేడ్) కార్యక్రమం ప్రారంభం

:చందూరు తెలంగాణ పత్రిక జూన్ 4




నల్గొండ జిల్లా చందూరు మండల పరిధిలోని బంగారుగడ్డ గ్రామంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' గ్రామసభ స్థానిక సర్పంచ్ అధ్యక్షతన అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి నల్గొండ జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. వారితో పాటు జిల్లా పంచాయతీ అధికారి, చందూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి , మండల తాసిల్దార్, మండల విద్యాధికారి , జిల్లా వ్యవసాయ శాఖ డైరెక్టర్, మండల వ్యవసాయ అధికారి , APO, పంచాయతీ కార్యదర్శులు మరియు వివిధ శాఖల మండల స్థాయి అధికారులు ఈ సభలో పాల్గొన్నారు. గ్రామ ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది, మహిళలు, యువకులు మరియు గ్రామ పెద్దలు భారీ సంఖ్యలో తరలివచ్చి గ్రామసభను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని, తమ తమ శాఖల ద్వారా ప్రజలకు అందుతున్న పథకాలు, గ్రామంలో జరుగుతున్న ప్రగతి వివరాలను ప్రజలకు వివరించారు. కూలీల సంఖ్య పెరిగితేనే గ్రామానికి నిధులు: జిల్లా కలెక్టర్ ?సభలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాలలో ఉపాధి హామీ పనులకు లేబర్ (కూలీల) హాజరు శాతాన్ని గణనీయంగా పెంచాలని సూచించారు. ఎక్కువ మంది కూలీలు పనులకు వచ్చినప్పుడే గ్రామానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి 'మెటీరియల్ పేమెంట్' రూపంలో పెద్ద ఎత్తున నిధులు వస్తాయని, ఆ నిధులతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అద్భుతంగా అభివృద్ధి చేసుకోవచ్చని వివరించారు.ప్లాస్టిక్ రహిత గ్రామంగా బంగారుగడ్డ - ఉపసర్పంచ్ దాతృత్వం బంగారుగడ్డ గ్రామంలో ప్లాస్టిక్ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించాలనే ఉద్దేశంతో గ్రామ ఉపసర్పంచ్ గారు అభినందనీయమైన నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో ప్లాస్టిక్ నిషేధం కొరకు తన వంతు సహాయంగా 500 స్టీల్ ప్లేట్లు, 500 స్టీల్ గ్లాసులను స్వంత ఖర్చులతో కొనుగోలు చేసి గ్రామ పంచాయతీకి అప్పగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గారు ఉపసర్పంచ్ గారి దాతృత్వాన్ని నిండు సభలో ప్రత్యేకంగా అభినందించారు. గ్రామ ప్రజలందరూ ఇకపై ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా పక్కనబెట్టి, శుభకార్యాల్లో ఈ స్టీల్ గ్లాసులు, ప్లేట్లనే ఉపయోగించి బంగారుగడ్డను ఆదర్శ ప్లాస్టిక్ రహిత గ్రామంగా మార్చాలని పిలుపునిచ్చారు. చెత్త వర్గీకరణతోనే పర్యావరణ పరిరక్షణ పరిశుభ్రతపై కలెక్టర్ గారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్దే చెత్తను తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ చెత్త మరియు ప్రత్యేక జాగ్రత్తలు అవసరమైన చెత్తగా వేరు చేసి పంచాయతీ వాహనాలకు అందించాలన్నారు. చెత్తను ఇలా వర్గీకరించడం వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని జరగకుండా కాపాడుకోవచ్చని స్పష్టం చేశారు. 'అమ్మ పేరుతో ఒక మొక్క' (మా కే నామ్ పర్ ఏక్ పేడ్) అనంతరం స్వచ్ఛభారత్ గ్రామీణ కార్యక్రమంలో భాగంగా బంగారుగడ్డ గ్రామ నర్సరీలో కలెక్టర్ గారు మరియు ఇతర ప్రముఖులు "అమ్మ పేరుతో ఒక మొక్క" (మా కే నామ్ పర్ ఏక్ పేడ్) అనే అద్భుతమైన నినాదంతో మొక్కలు నాటారు. మనకు జన్మనిచ్చిన అమ్మను ఎలా గౌరవిస్తామో, మనకు ప్రాణాధారమైన పర్యావరణాన్ని రక్షించడానికి ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా మొక్కలు నాటాలని, వాటిని కేవలం నాటడమే కాకుండా వృక్షాలుగా మారే వరకు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ గారు హితవు పలికారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సమష్టి భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ గ్రామసభ పర్యావరణ చైతన్యానికి, గ్రామ వికాసానికి దిక్సూచిగా నిలిచింది.

# అంగన్వాడి సెంటర్లో విద్యార్థులకు యూనిఫామ్ లు పంపిణీ



కామారెడ్డి,జూన్ 4 ,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా దోమకొండ మండలంలోని 33 అంగన్వాడి సెంటర్లలో అందులో పలుగడ్డ సెంటర్ నంబర్ 142 లో బాలురకు 616 యూనిఫామ్ బాలికలకు 596 మొత్తం 1212 యూనిఫాములను దోమకొండ గ్రామ సర్పంచ్ ఐరన్ నరసయ్య గురువారంపంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రభుత్వ ప్రణాళికలో భాగంగా ఇన్చార్జి మంత్రి సీతక్క సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ ఆదేశాల మేరకు అంగన్వాడి సెంటర్లకు విద్యార్థిని విద్యార్థులకు ఇట్టి యూనిఫామ్ లను అందజేయడం జరుగుతుందని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల్ గౌడ్, మాజీ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అనంతరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సీతారాం మధు మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్ రెడ్డి, గ్రామ పంచాయతీ సభ్యులు నరసింహులు అంగన్వాడి టీచర్ సీతారాం బూదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

-బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి
-జిల్లా పంచాయతీ అధికారి ఎ. రవీందర్



నంగునూరు, జూన్ 4(తెలంగాణ పత్రిక):

ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా పంచాయతీ అధికారి ఎ.రవీందర్ చెప్పారు. గురువారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అప్పలాయ చెరువు గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామ సభలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్పంచ్ సత్యం అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. వానాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఇందుకోసం అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. నంగునూరు ఎంపీడీవో మహబూబ్ అలీ మాట్లాడుతూ రసాయన ఎరువులను మోతాదుకు మించి వాడ వద్దని సూచించారు. సాధ్యమైనంత మేరకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలన్నారు. నిబంధనల మేరకు రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. ఓటరు తనిఖీ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం తడి, పొడి, ప్రమాదకరమైన, హానికరమైన చెత్తను వేరు చేసి చెత్త బండికి అందించాలని చెప్పారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బడి ఈడు పిల్లలందరిని చేర్పించాలని కోరారు. ప్రభు పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి చేయూత ఇచ్చి ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని కోరారు. గ్రామీణ మంచినీటి సరఫరా పథకం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సౌమ్య, వ్యవసాయ విస్తరణాధికారి ఎ.పవన్, పంచాయతీ కార్యదర్శి ఆర్.ప్రత్యూష, జీపీఓ ఎన్. సాయిలు, ఉపాధ్యాయులు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పిడుగు పడి పెద్ద మల్లారెడ్డి లో ఒకరు మృతి

కామారెడ్డి ,జూన్ 4,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం పెద్ద మల్లారెడ్డి గ్రామంలో గురువారం పిడుగు పడి మృతి చెందినట్లు తెలిపారు. గురువారం మధ్యాహ్నం నుంచి పెద్ద ఎత్తున ఈదురు గాలులు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది దీంతో గ్రామ శివారులో గల డబుల్ బెడ్ రూమ్ ప్రాంతంలో పిడుగు పడటంతో బిబిపేట మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు.

## గ్రామ ప్రగతికి ప్రత్యేక గ్రామ సభలు దోహదం
## పడతాయి తహసిల్దార్ ధీరజ్ కుమార్





ఓదెల జూన్ 04, తెలంగాణ పత్రిక

గ్రామ ప్రగతి, అభివృద్ధిపై చర్చించుకోవడానికి ప్రత్యేక గ్రామ సభలు దోహద పడతాయని, ప్రజల భాగస్వామ్యంతో గ్రామ అభివృద్ధికి కార్యాచరణ, ప్రణాళిక రూపొందించవచ్చని తహసిల్దార్ దిరాజ్ కుమార్ పేర్కొన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఓదెల మండలంలోని గుండ్లపల్లి గూడెం గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు తహసిల్దార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వర్షాకాల సన్నద్ధత, పంట మార్పిడి, వ్యవసాయ, ఉద్యానవన శాఖల కార్యాచరణ ప్రణాళిక, బడి బాట, ఘన వ్యర్థాల నిర్వహణ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, విపత్తుల నిర్వహణ, పారిశుధ్యం, మొక్కల పెంపకం, జల సంరక్షణ, అరైవ్–అలైవ్ తదితర అంశాలపై గ్రామ ప్రజలతో సుదీర్ఘంగా చర్చించి అవగాహన కల్పించారు.తమ మండల, గ్రామాల్లో ఉన్న అధికారులు శాఖల వారీగా ఏయే కార్యక్రమాలు చేపడుతున్నారు అనే విషయాలపై సంపూర్ణ అవగాహన ప్రజలు కలిగి ఉండాలని అన్నారు.

**ఎంపీడీవో అనిల్ రెడ్డి మాట్లాడుతూ**

వర్షాకాల సన్నద్ధతపై అధికారులు సూచించిన విషయాలను ప్రజలు పాటించాలని సూచించారు వర్షాకాలానికి ముందే గ్రామాల్లోని డ్రైనేజీలు శుభ్రం చేయడం గ్రామ పంచాయితీ బాధ్యత అని తెలిపారు. డ్రైనేజీల్లో ప్లాస్టిక్, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దని కోరారు. ఘన వ్యర్థాల నిర్వహణ – 2026 పై ప్రజలు ఖచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని, చెత్తను నాలుగు రకాలుగా వేరు చేయాలని సూచించారు. తడి, పొడి, సానిటరీ, ప్రత్యేక చెత్త గా వేరు చేసి గ్రామ పంచాయితీ వాహనానికి అందించాలని అన్నారు.సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్వహణపై అవగాహన పొందాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతీ వార్డులో చెత్తను వేరు చేసి కంపోస్ట్ షెడ్ కు తరలించే బాధ్యత ప్రతీ వార్డు సభ్యులు తీసుకోవాలని సూచించారు. మన ఆరోగ్యం పాడవకుండా ఉండాలంటే స్వచ్ఛందంగా ఈ సూచనలు పాటించాలని పేర్కొన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించి క్రమం తప్పకుండా నీటి ట్యాంకులను బ్లీచింగ్ తో సిబ్బంది శుభ్రం చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు రాకుండా స్వచ్ఛమైన నీటి సరఫరా అందించే బాధ్యత అధికారులపై ఉంటుందని, నీటి సరఫరా, నిర్వహణ సక్రమంగా లేకపోతే ప్రజలు అధికారులకు సమాచారం అందించాలని అన్నారు.

**వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్ మాట్లాడుతూ**

పంటల వైవిధ్యంపై రైతులు వ్యవసాయ అధికారులు అందించే సలహాలు, సూచనలు పాటించాలని, ఎల్నినో ప్రభావం దృష్ట్యా పంటలు సాగు చేసేముందు వ్యవసాయ అధికారులను సంప్రదించి, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తే ఇబ్బందులు కలగకుండా ఉంటుందని అన్నారు. ఆయిల్ పామ్, కూరగాయలు, పత్తి, తదితర లాభదాయక పంటలను సాగు చేయడానికి రైతులు ముందుకు రావాలని సూచించారు. . వరిలో సన్న వడ్లను సాగు చేస్తే బోనస్ అందించడం జరుగుతుందని, సన్న వడ్ల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. పంట మార్పిడి చేయకపోతే నేల సారం తగ్గుతుందనే విషయాన్ని రైతులు గమనించాలని పేర్కొన్నారు

**ఈ సందర్భంగా ఎస్సై దీకొండ రమేష్ మాట్లాడుతూ**

.అరైవ్ – అలైవ్ లో భాగంగా రోడ్డు భద్రతపై అందరికీ అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాల సంఖ్య నియంత్రించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ద్విచక్రవాహనం నడిపే ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని అన్నారు. ప్రతీ నెల రోడ్డు భద్రత సమావేశాలు నిర్వహించి, రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి అవసరమయ్యే చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించే బీఎల్ఓ లకు ప్రజలు సహకరించాలని అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శాల మేరకు ఈ ఈ నెల 25 వ తేదీ నుండి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. గుర్తింపు కార్డులు చూపించి మ్యాపింగ్ ప్రక్రియకు సహకరించాలని కోరారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 12 వ తేదీ వరకు పర్యావరణ అంశాలపై కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు పంపించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రభుత్వం అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహసిల్దార్ ది రాజ్ కుమార్ ఎంపీడీవో అనిల్ రెడ్డి ఎస్సై దికొండ రమేష్ వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్ నీటిపారుదల శాఖ ఏఈ కరెంటు ఏఈ తోపాటు గ్రామపంచాయతీ కార్యదర్శులు ప్రజలు బిఎల్వోలు భారీ ఎత్తున పాల్గొన్నారు

# గ్రామ అభివృద్ధే లక్ష్యంగా -- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా”

**-శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలతో దూసుకుపోతున్న సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్.**

**-రూ.60 లక్షల తో సిసి రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం.**

రాజేంద్రనగర్ ప్రతినిధి జూన్ 04 తెలంగాణ పత్రిక.



గ్రామ అభివృద్ధే నా ధ్యేయం ప్రజా సంక్షేమమే నా లక్ష్యం అంటు నర్కుడ గ్రామాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్న సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ గురువారం నాడు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. రూ.60 లక్షలతో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టారు. సందర్భంగా సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ మాట్లాడుతూ, “నర్కుడ గ్రామ ప్రజల సంక్షేమమే నా ధ్యేయం గ్రామ అభివృద్ధే నా లక్ష్యం అని తెలిపారు. నర్కుడ గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ, ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో ముందుండి . గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. గ్రామ అభివృద్ధికి పెద్దపీట వేస్తూ వరుసగా అభివృద్ధి కార్యక్రమాలతో దూసుకుపోతున్న సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ నాయకత్వాన్ని గ్రామ ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నీరటి మహేష్, వార్డు సభ్యులు పర్వతం వెంకటయ్య, చౌట రాజు, తొంట జంగమ్మ, కనకమామిడి విష్ణు, కుంచ లత-కుమార్ గౌడ్, బుర్కుంట నాగరాజు, పర్వతం వినోద్, లింగం సంధ్య-నవీన్, గూడెపు నీరజ-లక్ష్మణ్, కర్రె అఖిల-గణేష్, నాయకులు నీరటి శేఖర్, తొంట అశోక్, చందనవెల్లి శ్రీనివాస్, నీరటి అశోక్, టి. కుమార్ గౌడ్, హిరేకర్ శివాజీ, గడ్డం మల్లేష్ యాదవ్, రక్షిత్ గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలలను మర్చిపోండి... ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు

**-ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి**

**-ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య**

వెల్దుర్తిమండల ప్రతినిధి,జూన్ 04 (తెలంగాణ పత్రిక):





వెల్దుర్తి మండల పరిధిలోని ఎలకపల్లి గ్రామంలో గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పీఎం శ్రీ పాఠశాల ఆధ్వర్యంలో బడి వయసు పిల్లల నమోదు కోసం ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎం శ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య మాట్లాడుతూ, బడి వయసు వచ్చిన ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ విద్యా సదుపాయాలు, క్రీడా సామగ్రి వంటి అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు.ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు చెల్లించి ఆర్థిక భారం మోసే బదులు, ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్న మెరుగైన విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఇంటింటికి వెళ్లి గ్రామస్తులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సదుపాయాలు, విద్యా ప్రమాణాల గురించి అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి సానుకూలంగా స్పందించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు వచ్చారు.ఈ కార్యక్రమంలో వెల్దుర్తి ఎంపీడీవో హరి పంచాయతీ సెక్రెటరీ కృష్ణ, స్థానిక సర్పంచ్ పావని శివలింగం, ఉపసర్పంచ్ పవన్ కుమార్,స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. వీరేందర్, మరియు వార్డ్ మెంబర్లు గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధికి కార్యాచరణ

**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**-గ్రామ ప్రగతికి ప్రత్యేక గ్రామ సభలు దోహదం**

**-ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక గ్రామ సభల నిర్వహణ**

**-కోనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలో పాల్గొన్న కలెక్టర్**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 04, తెలంగాణ పత్రిక





గ్రామ ప్రగతి, అభివృద్ధిపై చర్చించుకోవడానికి ప్రత్యేక గ్రామ సభలు దోహద పడతాయని, ప్రజల భాగస్వామ్యంతో గ్రామ అభివృద్ధికి కార్యాచరణ, ప్రణాళిక రూపొందించవచ్చని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కోనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వర్షాకాల సన్నద్ధత, పంట మార్పిడి, వ్యవసాయ, ఉద్యానవన శాఖల కార్యాచరణ ప్రణాళిక, బడి బాట, ఘన వ్యర్థాల నిర్వహణ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, విపత్తుల నిర్వహణ, పారిశుధ్యం, మొక్కల పెంపకం, జల సంరక్షణ, అరైవ్–అలైవ్ తదితర అంశాలపై గ్రామ ప్రజలతో సుదీర్ఘంగా చర్చించి అవగాహన కల్పించారు. తమ మండల, గ్రామాల్లో ఉన్న అధికారులు శాఖల వారీగా ఏయే కార్యక్రమాలు చేపడుతున్నారు అనే విషయాలపై సంపూర్ణ అవగాహన ప్రజలు కలిగి ఉండాలని అన్నారు. వర్షాకాల సన్నద్ధతపై అధికారులు సూచించిన విషయాలను ప్రజలు పాటించాలని కలెక్టర్ అన్నారు. వర్షాకాలానికి ముందే గ్రామాల్లోని డ్రైనేజీలు శుభ్రం చేయడం గ్రామ పంచాయితీ బాధ్యత అని తెలిపారు. డ్రైనేజీల్లో ప్లాస్టిక్, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దని కోరారు. ఘన వ్యర్థాల నిర్వహణ -2026 పై ప్రజలు ఖచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని, చెత్తను నాలుగు రకాలుగా వేరు చేయాలని సూచించారు. తడి, పొడి, సానిటరీ, ప్రత్యేక చెత్త గా వేరు చేసి గ్రామ పంచాయితీ వాహనానికి అందించాలని అన్నారు.సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్వహణపై అవగాహన పొందాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతీ వార్డులో చెత్తను వేరు చేసి కంపోస్ట్ షెడ్ కు తరలించే బాధ్యత ప్రతీ వార్డు సభ్యులు తీసుకోవాలని సూచించారు. మన ఆరోగ్యం పాడవకుండా ఉండాలంటే స్వచ్ఛందంగా ఈ సూచనలు పాటించాలని కలెకర్ పేర్కొన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించి క్రమం తప్పకుండా నీటి ట్యాంకులను బ్లీచింగ్ తో సిబ్బంది శుభ్రం చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు రాకుండా స్వచ్ఛమైన నీటి సరఫరా అందించే బాధ్యత అధికారులపై ఉంటుందని, నీటి సరఫరా, నిర్వహణ సక్రమంగా లేకపోతే ప్రజలు అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. పంటల వైవిధ్యంపై రైతులు వ్యవసాయ అధికారులు అందించే సలహాలు, సూచనలు పాటించాలని, ఎల్నినో ప్రభావం దృష్ట్యా పంటలు సాగు చేసేముందు వ్యవసాయ అధికారులను సంప్రదించి, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తే ఇబ్బందులు కలగకుండా ఉంటుందని అన్నారు. ఆయిల్ పామ్, కూరగాయలు, పత్తి, తదితర లాభదాయక పంటలను సాగు చేయడానికి రైతులు ముందుకు రావాలని సూచించారు. ఆయిల్ పామ్ కు సంబంధించి సిద్దిపేట జిల్లా నర్మెట లో పరిశ్రమ ఉందని, పండించిన దిగుబడిని పరిశ్రమకు తీసుకువెళ్ళడానికి దూర భారం కూడా లేదని గుర్తు చేశారు. ఆయిల్ పామ్ సాగు చేయడానికి మొక్కలకు, డ్రిప్ కు సబ్సిడీ కూడా అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో అంతర పంటలను సాగు చేసేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. వరిలో సన్న వడ్లను సాగు చేస్తే బోనస్ అందించడం జరుగుతుందని, సన్న వడ్ల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. పంట మార్పిడి చేయకపోతే నేల సారం తగ్గుతుందనే విషయాన్ని రైతులు గమనించాలని పేర్కొన్నారు.అరైవ్ – అలైవ్ లో భాగంగా రోడ్డు భద్రతపై అందరికీ అవగాహన కల్పించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాల సంఖ్య నియంత్రించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ద్విచక్రవాహనం నడిపే ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని అన్నారు. ప్రతీ నెల రోడ్డు భద్రత సమావేశాలు నిర్వహించి, రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి అవసరమయ్యే చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించే బీఎల్ఓ లకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శాల మేరకు ఈ ఈ నెల 25 వ తేదీ నుండి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. గుర్తింపు కార్డులు చూపించి మ్యాపింగ్ ప్రక్రియకు సహకరించాలని కోరారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 12 వ తేదీ వరకు పర్యావరణ అంశాలపై కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు పంపించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రభుత్వం అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు. అనంతరం గ్రామంలోని నర్సరీ, కంపోస్ట్ షెడ్‌ను కలెక్టర్ పరిశీలించారు. లక్ష్యానికి అనుగుణంగా మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని సూచించారు. కంపోస్ట్ షెడ్‌ను పూర్తిగా వినియోగంలోకి తీసుకువచ్చి చెత్తను తప్పనిసరిగా నాలుగు విభాగాలుగా వేరు చేసి శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ కె.ఎస్.బి కుమారి, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీనారాయణ, వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, పంచాయతీ అధికారి షర్ఫుద్దీన్, మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ అన్వర్, ఇంట్రా ఈఈ సుమలత, జిల్లా వైద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, సర్పంచ్ స్వాతి, తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ స్నిగ్ధ, అటవీ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్, సన్న వడ్ల సాగుపై రైతులు దృష్టి పెట్టాలి: అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

-ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశం

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 04, తెలంగాణ పత్రిక






రైతులు పంట మార్పిడిపై దృష్టి సారించి ఆయిల్ పామ్, సన్న వడ్లు వంటి లాభదాయక పంటల సాగుకు ముందుకు రావాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సూచించారు. అలాగే ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.గురువారం వేములవాడ మండలం బాలానగర్, వేములవాడ రూరల్ మండలం వట్టెంల, ఫాజుల్‌నగర్, చందుర్తి మండలం మల్యాల, రుద్రంగి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు పంట మార్పిడి, లాభదాయక పంటల సాగు, వ్యవసాయంలో ప్రత్యామ్నాయ అవకాశాలపై చర్చించారు.తుది దశకు చేరుకున్న ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. ఇప్పటివరకు సేకరించిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకొని, తూకం పూర్తయిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించి కొనుగోళ్లు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రైతులు సంప్రదాయ పంటలతో పాటు లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించిన అదనపు కలెక్టర్, ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం మొక్కలు, డ్రిప్ వ్యవస్థలపై సబ్సిడీ అందజేస్తోందని తెలిపారు. సన్న వడ్లు, ఇతర ప్రత్యామ్నాయ పంటలను కూడా రైతులు సాగు చేయాలని కోరారు.అలాగే ఇప్పటికే ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతుల అనుభవాలను తెలుసుకుని అవగాహన పెంపొందించుకోవాలని, అధిక ఆదాయం వచ్చే పంటల వైపు రైతులు అడుగులు వేయాలని గడ్డం నగేష్ సూచించారు.

# ధాన్యం బస్తాల దిగుమతికి అంగీకరించని మిల్లర్లు

-తరుగు విధిస్తేనే దింపుకుంటామని స్పష్టీకరణ
-ట్రాక్టర్లలో ధాన్యం బస్తాలతో తహశీల్దార్ కార్యాలయానికి రైతులు
-తహశీల్దార్ ఫోన్ చేస్తే బస్తాకు 44 కిలోల తూకం వేయాలన్న మిల్లర్
-ప్రభుత్వ గిడ్డంగికి ధాన్యం తరలింపు

నంగునూరు, జూన్ 4(తెలంగాణ పత్రిక):





తూకం వేసి పంపిన వడ్లను దిగుమతి చేసుకోవడానికి బియ్యపు మిల్లు యజమాని అంగీకరించక పోవడంతో ట్రాక్టర్ల లోడు రైతులు గురువారం సాయంత్రం తహాశీల్దార్ కార్యాలయానికి వచ్చారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ఘనపురం గ్రామానికి చెందిన రైతుల వడ్లను కొనుగోలు కేంద్రంలో తూకం వేసి చిన్నకోడూరు మండలంలోని రాముని పట్లలోని ఓ బియ్యపు మిల్లుకు పంపారు. తరుగు విధిస్తేనే వడ్ల బస్తాలను దింపుకుంటామని మిల్లు యజమానులు స్పష్టం చేశారు. దీనికి రైతులు అంగీకరించక పోవడంతో బస్తాలను దింపుకునేందుకు మిల్లు యజమాని ససేమిరా అన్నారు. దీంతో కడుపు మండిన రైతులు వడ్ల లోడుతో ట్రాక్టర్లను తీసుకుని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. తహశీల్దారు ప్రవీణ్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. తహశీల్దారు ప్రవీణ్ రెడ్డి రైతుల ఫిర్యాదు మేరకు వెంటనే బియ్యపు మిల్లుకు ఫోన్ చేశారు. బస్తాకు 44 కిలోల తూకం వేస్తే ఎంతైనా కొంటామని మిల్లు యజమాని సమాధానం ఇచ్చారు. దీంతో గట్లమల్యాల గిడ్డంగుల శాఖకు చెందిన గిడ్డంగిలో ధాన్యం బస్తాలను దింపేందుకు తహశీల్దార్ చర్యలు తీసుకున్నారు. తరుగు విధిస్తేనే బస్తాలను దింపుకుంటామని చెప్పిన బియ్యపు మిల్లుపై నిబంధనల మేరకు అవసరమైన చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహశీల్దార్ ప్రవీణ్ రెడ్డి చెప్పారు.

# రైతుల గోసలు తీరేదెప్పుడు? రైతులను దోచుకుంటున్నదెవరు?

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 04, తెలంగాణ పత్రిక



ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతన్నకు న్యాయం ఎప్పుడు జరుగుతుందనే ప్రశ్న మళ్లీ ముందుకొస్తోంది. ప్రభుత్వాలు మారుతున్నాయి, నాయకులు మారుతున్నారు, కానీ రైతుల కష్టాలు మాత్రం మారడం లేదు. ఎండ, వాన, చలిని లెక్కచేయకుండా చెమటోడ్చి పంట పండించిన రైతు, చివరకు తన ధాన్యాన్ని అమ్మే సమయంలోనే దోపిడీకి గురవుతున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో "తరుగు" పేరుతో క్వింటాలుకు 8 కిలోల వరకు కోత విధిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంటే ప్రతి క్వింటాలుపై సుమారు రూ.200 వరకు రైతుకు నష్టం జరుగుతోందని చెబుతున్నారు. ఇది అధికారుల దృష్టికి రావడం లేదా, తెలిసీ పట్టించుకోవడం లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఉదాహరణకు ఒక గ్రామంలో ఈ సీజన్‌లో 20 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు జరిగితే, క్వింటాలుకు 8 కిలోల చొప్పున దాదాపు 1,600 క్వింటాళ్లు తరుగు పేరుతో కోతకు గురవుతాయి. దీని విలువ సుమారు రూ.39 లక్షలకు పైగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. ఒక గ్రామంలోనే ఇంత నష్టం జరిగితే, రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎంత మేరకు నష్టపోతున్నారో అర్థం చేసుకోవచ్చని అంటున్నారు. ఇదే కాకుండా హమాలీ చార్జీల పేరుతో క్వింటాలుకు రూ.40, లారీల్లో బస్తాలు ఎక్కించేందుకు బస్తాకు అదనంగా రూ.2 చొప్పున వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ఖర్చులన్నీ కలిపితే క్వింటాలుకు సుమారు రూ.250 వరకు రైతుకు నష్టం వాటిల్లుతోందని చెబుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతులకు ఎలాంటి కోతలు లేకుండా, వేగంగా ధాన్యం కొనుగోలు చేస్తామని హామీలు ఇచ్చిన నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను మరిచిపోయారని రైతులు విమర్శిస్తున్నారు. మద్దతు ధర రైతుల కోసమా, లేక మధ్యవర్తులు, మిల్లర్లు, కొందరు అధికారుల కోసమా అనే సందేహం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపి, తరుగు కోతలు, అదనపు వసూళ్లను అరికట్టి రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. రైతు కష్టానికి తగిన గౌరవం, గిట్టుబాటు ధర, పారదర్శక కొనుగోలు వ్యవస్థ కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

# భూంపల్లి గ్రామంలో గ్రామదేవతలకు బోనాలు సమర్పణ

కామారెడ్డి ,జూన్ 4,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని భూంపల్లి తదితర గ్రామంలో గ్రామదేవతలైన నల్లపోచమ్మ, పోలేరమ్మ. నాయకమ్మ, ముత్యాలమ్మ, బంగారు మైసమ్మ. ఐదు చేతుల పోచమ్మ. పిల్లి పోచమ్మ. అమ్మవార్లకు బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు సంప్రదాయబద్ధంగా అమ్మవార్లకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలన్నీ ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి. ప్రతి ఏడాది నిర్వహించే బోనాల పండుగ గ్రామ ప్రజల ఐక్యతకు, భక్తి భావనకు ప్రతీకగా నిలుస్తుందని గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామ ప్రజలు, మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోరికలు నెరవేరిన భక్తులు ప్రత్యేక బోనాలు సమర్పించి తమ కృతజ్ఞతను తెలియజేశారు.దఈ సందర్భంగా మహిళలు కొత్త కుండలను పసుపు, కుంకుమ, వేపాకులతో అందంగా అలంకరించి, వాటిలో అన్నం, పాలు, బెల్లంతో నైవేద్యం సిద్ధం చేశారు. సంప్రదాయ దుస్తులు ధరించి, తలపై బోనాలు మోసుకుంటూ డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా గ్రామ దేవాలయాలకు చేరుకున్నారు. గ్రామ వీధులన్నీ భక్తి గీతాలు, జైజై ధ్వనులతో మారుమోగాయి. అమ్మవారికి బోనాలతో పాటు పట్టు వస్త్రాలు, గాజులు, కొబ్బరికాయలు, పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో శాంతి, సుభిక్షం నెలకొనాలని, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, పశు సంపద వృద్ధి చెందాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని భక్తులు అమ్మవారిని ప్రార్థించారు. పిల్లాపాపలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక మొక్కులు చెల్లించారు. బోనాల ఉత్సవాల్లో పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డప్పు వాయిద్యాల మోత, పోతరాజుల నృత్యాలు, శివసత్తుల ఆటలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సంప్రదాయ కళారూపాలు గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబిస్తూ వేడుకలకు మరింత శోభను చేకూర్చాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొని పండుగను విజయవంతం చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామదేవతల ఆశీస్సులతోనే గ్రామాల్లో శాంతి, సుభిక్షాలు నెలకొంటాయని విశ్వసిస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం బోనాల పండుగను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని, ఈ వేడుకలు గ్రామ ప్రజల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాల్లో ప్రత్యేక పూజలు, హారతులు, భజనలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామ ప్రజలు కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతల అనుగ్రహంతో ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని, వ్యవసాయంలో సమృద్ధి కలగాలని, గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని భక్తులు ప్రార్థించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గైని శ్రీనివాస్. ఉపసర్పంచ్ దానే రాజయ్య. సదాశివ నగర్ మాజీ ఎంపీపీ గైని అనసూయ రమేష్.వార్డ్ మెంబర్లు కుమ్మరి కాశయ్య మొగ్గం రజిత సుమన్ ముకుంద సుధాకర్ రావు అంజనీ బాయి గోపాలరావు గడిల లత దత్తు రావుమొగ్గం రాజమణి రమేష్ బండ శీను మొగ్గం బాలరాజొగ్గం సాయిలుగ్రామ పెద్దలు మహిళామణులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుని అంత్యక్రియలకు రూ.5వేల ఆర్థిక సాయం



నంగునూరు, జూన్ 4(తెలంగాణ పత్రిక):

సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం, వెంకటాపూర్ కు చెందిన తడ్కపల్లి పోచయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు పోచయ్య అంత్యక్రియల నిమిత్తం రూ. అయిదు వేల ఆర్థిక సహాయం అందించారు. గురువారం గ్రామ సర్పంచి రేకులపల్లి సంతోష్ రెడ్డి ద్వారా ఈ డబ్బులను పంపించారు. హరీశ్ రావు ఆదేశాల మేరకు సర్పంచి రేకులపల్లి సంతోష్ రెడ్డి తడ్కపల్లి పోచయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చి, అంత్యక్రియల నిమిత్తం రూ. అయిదు వేల ఆర్థిక సహాయం అందించారు. బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రంగు రాజు గౌడ్, ఉప సర్పంచి గుండెల్లి కవిత రాజు, వార్డు సభ్యులు దుంబాల సాయి కిరణ్ గౌడ్, లింగంపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు రేకులపల్లి కోటీశ్వర్ రెడ్డి, తడ్కపల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు.

# బ్యాటరీల దొంగల పట్టివేత




జగిత్యాల రూరల్ (తెలంగాణ పత్రిక) జూన్ 4

జగిత్యాల రూరల్ మండలం పరిధిలోని ధరూర్ గ్రామ శివారులో నిర్వహించిన వాహనాల తనిఖీల నేపథ్యంలో రూరల్ మండల పరిధిలో తదితర గ్రామ పంచాయతీల్లో టి ఫైబర్ పరికరాలను దొంగిలిచిన ముగ్గురు దొంగలను రూరల్ పోలిషులు చాకచక్యంగా పట్టుకున్నారు.39 డ్రై బ్యాటరీలు, 4 యూపిఎస్ పవర్ సప్లయర్లను, బజాజ్ ప్యాసింజర్ ఆటో స్వాదీనం చేసుకున్నట్లు,పట్టుకున్న వస్తువుల విలువ సుమారు 4.52లక్షలు ఉంటుందని, నిందితులు లక్ష్మిపూర్ కు చెందిన బండ అంజయ్య, మండలి రవి, చెమేల్ల నరేష్ లను అరెస్టు చేసి రిమాండ్ కు పంపిస్తున్నట్టు రూరల్ పోలీసులు తెలిపారు.

# దశదిన కర్మలో బిఆర్ఎస్ నాయకులు

మంగపేట,జూన్ 04(తెలంగాణ పత్రిక)



ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజి గ్రామ కమిటీ కోశాధికారి పగడాల వెంకట్ రెడ్డి తల్లి పగడాల లక్ష్మి గత కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో స్వర్గస్తులయ్యారు గురువారం దశదిన కర్మకు కమలాపురం గ్రామంలోని వారి స్వగృహం లో దశదిన కర్మకు బిఆర్ఎస్ పార్టీనాయకులు హాజరై వెంకటరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి లక్ష్మి చిత్ర పటానికి పూలతో నివాళులు అర్పించి వారి ఆత్మ శాంతించాలని శ్రద్ధాంజలి గటించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు భూక్యా జంపన్న మండల మాజి అధ్యక్షులు కుడుముల లక్ష్మి నారాయణ తాటి కృష్ణ రాజు యాదవ్ బడిశా నాగ రమేష్ మాజి ఆత్మ కమిటీ చైర్మన్ దుర్గం రమణయ్య చల్లగురుగుల తిరుపతి,మాజీ మంగపేట మండల షోషల్ మీడియా ఇంచార్జ్ గుడివాడ శ్రీహరి వీరగాని బాలకృష్ణ గోమాస చందర్ రావు,పార్టీ సీనియర్ నాయకులు బానోత్ వసూరామ్ నాయక్,రాజేష్ బీస్ సాంబయ్య లీలకృష్ణ వంగేటి వెంకట్ రెడ్డి, కమలాకర్.

# 108 అంబులెన్స్‌పై ఆకస్మిక తనిఖీ

-అప్రమత్తతతో పనిచేయాలి.. 108 సిబ్బందికి జిల్లా అధికారి సూచన

ఆళ్లపల్లి, జూన్ 4: తెలంగాణ పత్రిక ప్రతినిధి



ఆళ్లపల్లి మండల కేంద్రంలో సేవలందిస్తున్న 108 అంబులెన్స్ వాహనాన్ని గురువారం కొత్తగూడెం జిల్లా అధికారి కురుమ సతీష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లోని అత్యవసర వైద్య పరికరాలను పరిశీలించి, వాటి పనితీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అంబులెన్స్ ఎల్లప్పుడూ సక్రమంగా పనిచేసేలా నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వాహనం మరమ్మతులకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు 108 సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర ఘటనల్లో క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించే సమయంలో అన్ని భద్రతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన అత్యవసర వైద్య సేవలు అందించడంలో 108 అంబులెన్స్ కీలక పాత్ర పోషిస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది పరం సునీల్ కుమార్, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేత గడ్డం చంద్రశేఖర్ రెడ్డికి పిసిసి ,డిఏసి షో కాస్ నోటీస్

కామారెడ్డి ,జూన్ 4,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) క్రమశిక్షణా చర్యల కమిటీ (డీఏసీ) కామారెడ్డి జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డికి షోకాజ్ నోటీసు జారీ చేసింది. డీఏసీ చైర్మన్, ఎంపీ డాక్టర్ మల్లు రవిడీఏసీ ఉపాధ్యక్షుడు శ్యామ్ మోహన్ అనంతుల సంయుక్తంగా జారీ చేసిన నోటీసులో, కామారెడ్డి జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన ఫిర్యాదులు, పార్టీ వ్యతిరేక వ్యాఖ్యలకు సంబంధించిన పత్రికా కథనాలు, అలాగే ఇతర పేలుడు పదార్థాలతో సంబంధించిన కేసు, మరియు మున్సిపాలిటీలోని పాత సామాను అమ్మిన కేసు మరియు భూ కబ్జాలపై కేసు అలాగే అతనిపై దాదాపు 13 ఎఫ్ఐఆర్లు 420 కేసులు ఆధారలతో సహా వచ్చిన ఆరోపణలపై కమిటీ దృష్టికి వచ్చిన అంశాలను ప్రస్తావించారు. అదేవిధంగా, పార్టీకి చెందిన ఒక సీనియర్ నాయకుడిపై చేసిన వ్యాఖ్యలు పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించాయనే ఆరోపణలు కూడా నోటీసులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, తనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి పూర్తి స్థాయి లిఖితపూర్వక వివరణను ఏడు రోజులలోగా, అంటే 11 జూన్ 2026 లోపు డీఏసీకి సమర్పించాలని చంద్రశేఖర్ రెడ్డిని నోటీసు ద్వారా ఆదేశించారు. ఫిర్యాదులు మరియు ప్రాతినిధ్యాల ప్రతులను కూడా నోటీసుకు జతచేసినట్లు టీపీసీసీ డీఏసీ వెల్లడించింది. వివరణ అందిన అనంతరం పార్టీ నియమ నిబంధనల ప్రకారం తదుపరి చర్యలపై కమిటీ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం, ప్రతి వ్యక్తి లో పర్యావరణ స్పృహ పెరగాలి

-లెక్చరర్ ఉమాశేషారావు వైద్య




కామారెడ్డి ,జూన్ 4,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంత్సరంజూన్5నపర్యవరణ దినోత్సవాన్ని జరు పు కుంటారు.ప్రకృతి మ న జీవనానికి ఆధారం గా లి,నీరు,నేల, చెట్లు అన్ని ఇవి మనకు అవసరమైన మూలాదారాలు.అయితే నేటి ఆధునిక జీవన శైలి తో పర్యావరణం పై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ పరిస్థితుల్లో పర్యావరణ దినోత్సవం ప్రాముఖ్యత విస్తృతం అవుతుంది. ఇటీవల మారుతున్న వాతావరణ మార్పులు అధిక ఉష్ణోగ్రతలు, అనియంత్రిత వర్షాలు,కరువు,తుపాన్లు వంటి ప్రకృతి విపత్తులు ఎక్కువ అవుతున్నాయి ఇవన్ని గ్లోబల్ వార్మింగ్ కారణంచేత జరుగుతు న్నాయి. భూమిఉష్ణోగ్రతలుపెరగడంవల్లహిమాలయనదులుకరుగుతున్నాయి. సముద్ర మట్టం పెరు గుతుంది ఇది మన భవి ష్యత్తు కు పెను ప్రమాదం.

మనుషుల నిర్లక్ష్యం వల్ల అడవులు నరికి వేత, పరి శ్రమల కాలుష్యం ప్లాస్టిక్ వినియోగం పెరగడంజరు గుతుంది. ఫలితంగా జీవ వైవిధ్యం తగ్గిపోతుంది జంతువులు పక్షులు అం తరించిపోతున్నాయి. ప్ర కృతి సమతుల్యత దెబ్బ తింటుంది.కాలుష్యం వల్ల మన ఆరోగ్యం కూడా ప్రమాదం లో పడుతుంది గాలి కాలుష్యం వల్ల శ్వాశ కోశ వ్యాధులు వస్తున్నాయి. శుభ్రమైన పర్యావరణము లేకుండా ఆరోగ్యకరమైన జీవితం అసాధ్యం.ఒక మహోద్యమం లా చెట్లు నాటలి,నీటి పొదుపు ,రసాయన ఎరువుల నియంత్రణ, పర్యావరణ రహితమైన వాహనాల వినియోగం తగ్గింపు, ప్లాస్టిక్ పూర్తిగా నిషేధం,అడవులసంరక్షణ, మొదలైనవి యుద్ధ ప్రతిపాధికానజరగాలి.ప్రతి వ్యక్తి,ప్రతి కుటుంబం లో పర్యావరణ స్పృహ పెరగాలి.

# క్రీడలు శారీరక మానసిక వికాసానికి దోహదపడతాయి.

-ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.

రాజేంద్రనగర్ ప్రతినిధి జూన్ 04 తెలంగాణ పత్రిక.



క్రీడలు శారీరక మానసిక వికాసానికి దోహద దపడతాయని రాజేంద్రనగర్ శాసనసభ సభ్యుడు ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. జిహెచ్ఎంసి శంషాబాద్ జోన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ సమ్మర్ క్యాంప్ 2026 ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. గత వారం రోజులుగా ఈ క్రీడలను నిర్వహించారు. క్రీడలలో తమ ప్రతిభను చాటుకున్న విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేసి అభినందించారు. యువత క్రీడల్లో రానించి రాష్ట్ర జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది నియోజకవర్గానికి తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరును తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు నాయకులు ,ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాయి బ్రాహ్మణులను కించపరిచే పదాలకు చెక్... ప్రభుత్వ కీలక నిర్ణయం

-హర్షం వ్యక్తం చేస్తున్న నాయి బ్రాహ్మణ సేవా సంఘాలు

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 4: (తెలంగాణ పత్రిక)

నాయి బ్రాహ్మణులను, వారి సామాజిక వర్గాన్ని కించపరిచే పదాల వాడకంపై తెలంగాణ ప్రభుత్వం నిషేధం విధించడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా నాయి బ్రాహ్మణ సేవా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. మంగళి, మంగలోడా, బొచ్చుగొరిగేవాడా, మంగలిది, కొండ మంగలి తదితర అవమానకర పదాలను ఉపయోగించడం ద్వారా నాయి బ్రాహ్మణుల మనోభావాలను దెబ్బతీసినట్లుగా పరిగణిస్తామని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇలాంటి పదాలను ఉపయోగించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేయడంతో నాయి బ్రాహ్మణ సామాజిక వర్గంలో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయం నాయి బ్రాహ్మణుల ఆత్మగౌరవాన్ని పరిరక్షించే దిశగా కీలక అడుగుగా సంఘ నాయకులు అభివర్ణిం చారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయి బ్రాహ్మణ సేవా



సంఘం 500/82 జిల్లా అధ్యక్షుడు కడియాల సత్యనారాయణ మాట్లాడుతూ, నాయి బ్రాహ్మణులను కులం పేరుతో దూషించే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా జీవో జారీ చేయడంలో చొరవ చూపిన తెలంగాణ రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సామాజిక వర్గాల ఆత్మగౌరవాన్ని కాపాడే నిర్ణయం తీసుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల సమాజంలో పరస్పర గౌరవం పెంపొందుతుందని, వివక్షపూరిత వ్యాఖ్యలకు అడ్డుకట్ట పడుతుందని నాయి బ్రాహ్మణ సేవా సంఘాల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

# జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులకు అక్రిడేషన్ కార్డులు అందజేసిన

-జిల్లా కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూన్ 4

జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులకు జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో అక్రిడేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను అభినందించిన కలెక్టర్, మీడియా ప్రతినిధులు ప్రజలకు సమాచారాన్ని చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల అక్రిడేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. అర్హులైన మీడియా ప్రతినిధులకు శుక్రవారం నుండి జిల్లా పౌర సంబంధాల అధికారి



కార్యాలయంలో అక్రిడేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. సంబంధిత మీడియా ప్రతినిధులు నిర్ణీత సమయంలో కార్యాలయానికి వచ్చి తమ అక్రిడేషన్ కార్డులను స్వీకరించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా ఒక ముఖ్యమైన స్తంభమని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంతో పాటు ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టులు విశేష సేవలు అందిస్తున్నారని కలెక్టర్ అన్నారు. మీడియా ప్రతినిధులు తమ వృత్తి నిబద్ధతను కొనసాగిస్తూ ప్రజలకు నిష్పాక్షిక సమాచారాన్ని అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి అజ్గర్ హుస్సేన్, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు, సమాచార పౌర సంబంధాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# సుదిరిగా చర్చ అనంతరం రైల్వే ఓవర్ బ్రిడ్జ్ కి సైనికులం

ఓదెల.జూన్.04 తెలంగాణ పత్రిక

ఓదెల మండలంలోని కొలనూరు రైల్వే స్టేషన్ సమీపంలో ఎల్ సి నెంబర్ 33 ఈ. అండర్ బ్రిడ్జి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించడం కోసం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కి, పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, ఓదెల తహసీల్దార్ ధీరజ్ మరియు రామగుండం సౌత్ సెంట్రల్ రైల్వే ఏ డి ఈ ఎన్ సుశాంత్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో హరిపురం రైల్వే అండర్ బ్రిడ్జ్ అంశంపై పెద్దపల్లి కలెక్టరేట్‌లో సుమారు ఒక గంట పాటు చర్చ నిర్వహించారు ఈ సందర్భంగా హరిపురం గ్రామ సర్పంచ్ గ్యారవేని విజయ నాగరాజు యాదవ్ గ్రామ ప్రజల తరఫున రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని వినతిపత్రం సమర్పించారు. సుదీర్ఘ చర్చ అనంతరం ఎట్టకేలకు రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు అంగీకరించడం జరిగిందని దీనికి కలెక్టర్ రైల్వే అధికారులు ఆర్డిఓ సానుకూలంగా స్పందించి దానిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు నాగరాజు తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ హరిపురం గ్రామంలోని రైల్వే క్రాసింగ్ ఎల్ సి నెంబర్33/ఈ వద్ద నిర్మాణంలో ఉన్న అండర్ బ్రిడ్జ్ పనులు 2020 సంవత్సరం నుంచి కొనసాగుతున్నప్పటికీ ఇప్పటివరకు పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రాలేదని ఈ అండర్ బ్రిడ్జి



నుండి విపరీతమైన వరదనీరు వస్తదని అంతేకాకుండా తుమ్మల కుంట, రాళ్ల కుంట, సూరం కుంట చెరువుల నీరు నిల్వ ఉండటం వల్ల అండర్ బ్రిడ్జ్ వద్ద డెడ్ స్టోరేజ్ సమస్య ఏర్పడి ప్రజలు, రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ మార్గాన్ని సుమారు 10 గ్రామాల ప్రజలు వినియోగిస్తున్నారని, 400 ఎకరాల వ్యవసాయ భూములకు రాకపోకలు, అనేక అంతరాయం కలుగుతుందని అంతేకాకుండా ఓదెల మండల కేంద్రానికి ప్రయాణం, సమ్మక్క-సారలమ్మ జాతరకు వెళ్లడం, ఐకేపీ వద్ద కొనుగోలు కేంద్రానికి చేరుకోవడం, గ్రామ శ్మశాన వాటికకు వెళ్లడం వంటి అవసరాలకు ఈ రహదారి అత్యంత కీలకమని వివరించడం జరిగిందని అన్నారు అందువల్ల ఎల్ సి నెంబర్.33/ఈ వద్ద అండర్ బ్రిడ్జ్‌కు బదులుగా రైల్వే ఓవర్ బ్రిడ్జ్ ఫ్లైఓవర్ మంజూరు చేయాలని, ప్రస్తుత రైల్వే గేటును యథావిధిగా కొనసాగించాలని, అలాగే ఓదెలకు వెళ్లే ఆర్‌డబీ రహదారిని పునర్నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరడం జరిగిందని అన్నారు ఈ అంశంపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ, రెవెన్యూ మరియు ఇరిగేషన్ శాఖల నివేదికల ప్రకారం ఆ ప్రాంతం అండర్ బ్రిడ్జ్ నిర్మాణానికి అనుకూలంగా లేదని పేర్కొన్నారు. అందువల్ల హరిపురం గ్రామంలో అండర్ బ్రిడ్జ్‌కు బదులుగా ఫ్లైఓవర్ ఏర్పాటు చేసే ప్రతిపాదనను పరిశీలించి చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులను ఆదేశించారని రైల్వే అధికారులు కూడా ఫ్లైఓవర్ ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించి అంగీకారం తెలపడం జరిగిందని అన్నారు ఈ సందర్భంగా గ్రామ ప్రజల తరఫున హరిపురం గ్రామ సర్పంచ్ గ్యారవేని విజయ నాగరాజు యాదవ్ జిల్లా కలెక్టర్ కి, రెవెన్యూ, ఇరిగేషన్ మరియు రైల్వే శాఖ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడవెల్లి విజయపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ మాటూరి మహేందర్, పెద్దపల్లి మాజీ మార్కెట్ చైర్మన్ ఐలయ్య, తుమ్మల లక్ష్మయ్య, తుమ్మల చంద్రయ్య, కాసారపు ఐలయ్య తదితరులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పీవీకే-5 ఇన్‌క్లైన్‌లో ప్రత్యేక భద్రత పై అవగాహన కార్యక్రమం





భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ జూన్ 4

గురువారం న కొత్తగూడెం ఏరియా పీవీకే నెం.5 ఇన్‌క్లైన్‌లో "ప్రాణాంతక ప్రమాదాల నివారణ కొరకు ప్రత్యేక భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం షాలేమ్ రాజు హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గనులలో ప్రతి ఉద్యోగి భద్రతా నియమాలను తూచా తప్పకుండా పాటించడమే ప్రమాదాల నివారణకు ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. సురక్షితమైన పని సంస్కృతి అలవర్చుకోవడం ద్వారా ప్రమాదరహిత వాతావరణాన్ని నెలకొల్పవచ్చని అన్నారు. భద్రత అనేది కేవలం నిబంధన మాత్రమే కాదని, ప్రతి ఉద్యోగి జీవితానికి సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశమని పేర్కొన్నారు. గనులలో పనిచేసే ప్రతి ఉద్యోగి తన భద్రతతో పాటు తోటి ఉద్యోగుల భద్రత పట్ల కూడా బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ప్రమాదరహిత పనితీరే సంస్థ అభివృద్ధికి, ఉద్యోగుల సంక్షేమానికి మూలాధారమని తెలిపారు. ఉద్యోగులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ భద్రతా నిబంధనలను పాటించాలని కోరారు. అలాగే ఏ -బి-సి-డి సూత్రాలను ప్రతి ఉద్యోగి తమ దైనందిన విధుల్లో ఆచరించాలని సూచించారు. భద్రత పట్ల సానుకూల దృక్పథం, క్రమశిక్షణ, బాధ్యతాయుత ప్రవర్తనతో సంస్థ లక్ష్య సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గనులలో వ్యక్తిగత రక్షణ పరికరాల వినియోగం, భద్రతా సూచనల పాటింపు అప్రమత్తత ద్వారా ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని వివరించారు. భద్రత విషయంలో రాజీ పడకుండా ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ షాలేమ్ రాజు తో పాటు , ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు , పీవీకే 5 ఏజెంట్ రామ్ బరోస్ మెహతో , పీవీకే 5 మేనేజర్ శ్యామ్ ప్రసాద్ , సేఫ్టీ ఆఫీసర్ అనీల్ సాగర్ పీవీకే వెల్ఫేర్ ఆఫీసర్ షకీల్ , ఏఐటియుసి ఫిట్ సెక్రటరీ భూక్యా రమేశ్ ఐఎన్ టియుసి ఫిట్ సెక్రటరీ చిలక రాజయ్య , గని అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సూపర్వైజర్లు ఉద్యోగులు పాల్గొన్నారు.

# గాంధీభవన్లో ప్రభుత్వ సలహాదారు

# షబ్బీర్ అలీ పై కామారెడ్డి నేతల ఫిర్యాదు

-పార్టీ బలోపేతం కాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపణలు
-మున్సిపల్ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారని మల్లు రవికి ఫిర్యాదు
-కామారెడ్డి లో కాంగ్రెస్ పార్టీని బ్రతికించాలని విన్నవించిన నాయకులు
-ఆరోపణలపై విచారణ జరుపుతానని మల్లు రవి హామీ



కామారెడ్డి, జూన్ 4,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కాంగ్రెస్ పార్టీతెలంగాణ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి కిప్రభుత్వ సలహాదారు కామారెడ్డికి చెందిన షబ్బీర్ అలీపై పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు గురువారం ఫిర్యాదు చేయగా సానుకూలంగా స్పందించారు. కామారెడ్డిలో పార్టీలో గ్రూప్ తాగాదాలకు ఆజ్యం పోస్తున్న మాజీ మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ వ్యవహార శైలీపై పీసీసీ జనరల్ సెక్రటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి వర్గం ఆధ్వర్యంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో ప్రముఖంగా అంశాలు ప్రస్థావించారు. కామారెడ్డి నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి పీసీసీ అధ్యక్షులు, నేటి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోటీ చేసిన సమయంలో మాజీ మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ వర్గం పనీ చేయని కారణంగా రేవంత్ రెడ్డిఓటమి పాలయ్యారు. షబ్బీర్ అలీ కామారెడ్డి బదులుగా నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి పోటీ చేయగా షబ్బీర్ అలీ అనుచరులు మాత్రం కామారెడ్డి నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ గెలుపు కోసం పనీ చేయని కారణంగా రేవంత్ రెడ్డి ఓటమి చెందారని బహిరంగ సత్యం. ఆ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి సోదరుడు శ్రీ కొండల్ రెడ్డి ఇంచార్జిగా వ్యవహరించి ప్రచారం నిర్వహిస్తే షబ్బీర్ అలీ అనుచరులు మాత్రం పనీ చేయకుండా నిరాకరణ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో శ్రీ రేవంత్ రెడ్డి గెలుపు కోసం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, అప్పటి మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందప్రియల ఆధ్వర్యంలో అహర్నిశలు శ్రమించడం జరిగింది. షబ్బీర్ అలీ 1989 ఎన్నికల నుంచి పోటీ చేస్తూనే వస్తున్నారు. ఇప్పటి వరకు మొత్తం మూడు నియోజకవర్గాల పరిధిలో ముఖ్యంగా కామారెడ్డి, (ఎల్లారెడ్డి ఉప ఎన్నిక), నిజామాబాద్ అర్బన్ నుంచి మొత్తం తొమ్మిది సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయగా, కేవలం రెండు సార్లు మాత్రమే (1989, 2004) గెలుపొందారు. ఆ తర్వాత ఏ ఎన్నిక్లల్లో విజయం సాధించలేదు. ద్వితీయ శ్రేణి నేతలకు మాత్రం అవకాశం కల్పించకుండా నిర్లక్ష్యం చేశారనేది బహిరంగ సత్యం. కొత్త నేతలను ఎదగనియకుండా, యూత్ కు అవకాశం కల్పించకుండా, పాత నేతలకు, సీనియర్స్ కు అవకాశం కల్పించక పోవడంతో కాంగ్రెస్ పార్టీని విడాల్సిన దుస్థితి కామారెడ్డి నియోజకవర్గంలో ఏర్పడింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంతో మంది సీనియర్స్, నియోజకవర్గ స్థాయి నాయకులు పార్టీ నుంచి పొమ్మనలేక పోగొట్టిన చరిత్ర షబ్బీర్ అలీ కుటుంబంపై ఉంది. ఒక్కసారి నియోజకవర్గంలో అధిష్టానం సర్వే చేసి అన్ని విషయాలు తెల్సుకోవాలని విజ్ఞప్తి చేయుచున్నాము. కామారెడ్డి నియోజకవర్గంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ తమ్ముడు మహ్మద్ నహీం అరాచకాలు అంతా ఇంతా కాదు. ఏ అధికారికి పోస్టింగ్ కావాలన్నా... ట్రాన్స్ఫర్ కావాలన్న ఆయన చెప్పిందే వేదం. ఇక్కడికి ఏ శాఖలో అయినా బదిలీపై రావాలన్న షబ్బీర్ అలీ సోదరుడు నహీంను ముందుగా సంప్రదించి అమామ్యాలు సమర్పించనిదే పనీ కాదు. ఎస్సై నుంచి మొదలుకొని డిఎస్పీ, తహసీల్దార్, ఎంపీడివో, డివిజన్, జిల్లా స్థాయి అధికారులు ఎవరైనా మండల స్థాయి అధికారుల నియామకంలో షబ్బీర్ అలీ కుటుంబ సభ్యులను కలవాల్సిన పరిస్థితి ఇక్కడ తయారైంది. 2026 మున్సిపల్ ఎన్నికల్లో కామారెడ్డిలో 49 వార్డులు ఉండగా షబ్బీర్ అలీ తరుపున 40వార్డులకు టికెట్స్ ఇవ్వగా వీరిలో 16మంది గెలుపొందారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి వర్గంకు 9 సీట్లు ఇవ్వగా ముగ్గురు గెలుపొందారు. మిగిలిన 6గురు అభ్యర్థులను షబ్బీర్ అలీ, ఆయన సోదరుడు నహీం, కుమారుడు ఇలియాస్, కుటుంబసభ్యులు మహ్మద్ ఇసాక్ షేర్, సోహెల్ లు ఓడించారని కామారెడ్డిలో మాత్రం కోడైకూస్తుంది. ఇక్కడ మరో వర్గం ఎదగకుండా ఉండేందుకు కుట్రలకు పాల్పడుతు కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణం అయ్యారు. ముఖ్యంగా మూడు చోట్ల ఇండిపెండెంట్ అభ్యర్థులు గెలిపించి కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించడంలో కీలక పాత్ర పోషించిన ఘటనలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీలో అర్హులైన చైర్మన్ అభ్యర్థులు ఉన్నపటికీ ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలిచిన అభ్యర్థికి కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ స్థానం కట్టబెట్టిన ఘనమైన చరిత్ర షబ్బీర్ అలీకి దక్కింది. కామారెడ్డి 38వ వార్డ్ నుంచి ఇండిపెండెంట్ గా విజయం సాధించిన ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ వద్ద 4కోట్ల డీల్ చేసుకొని ఛైర్పర్సన్ స్థానం ఇప్పించరనే విమర్శలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచినా అభ్యర్థులు ఉన్నప్పటికీ డబ్బుల కోసమే ఇండిపెండెంట్ అభ్యర్థికి చైర్మన్ స్థానం కల్పించిన చరిత్ర సీనియర్ నేత షబ్బీర్ అలీ కే దక్కింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ని ఓడించిన నేతలతో, కొండల్ రెడ్డిపై దాడికి యత్నించిన నేతలతో షబ్బీర్ అలీ వర్గం పనీ చేస్తుంది. కీ మున్సిపల్ కౌన్సిలర్ టికెట్లు ఇచ్చిన ప్రజాబీమొదం పొందక ఓటమి చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. టిపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జీసిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సామజిక కార్యక్రమాలు ముమ్మరంగా చేపడుతున్నారు. తాము కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తుంటే సీనియర్ నేత షబ్బీర్ అలీ మాత్రం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అవకాశం వచ్చిన ప్రతిసారి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. కామారెడ్డి పట్టణ పరిధితో పాటు నియోజకవర్గంలో ఆయా మండలాల పరిధిలో పార్టీ పటిష్టతకు కృషి చేస్తుంటే మాత్రం మమ్మల్ని అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారు. తమ అనుచరులపై, తమపై పోలీస్ అక్రమ కేసులు పెట్టడం, బెదిరింపులకు పాల్పడటం చేస్తున్నారు. పార్టీలో యువతను, మహిళలను చేర్చి పనీ చేస్తుంటే షబ్బీర్ అలీ ఆయన తమ్ముడు నహీంలు మాత్రం భయందోళనకు గురి చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. గత కొన్ని నెలలుగా కామారెడ్డి నియోజకవర్గం పరిధిలో ఇప్పటి వరకు నీరుపేదలకు పుస్తె మట్టెల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం చేసే పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం, వంట సామాగ్రి పంపిణీ, వైద్య సహాయం చేస్తు పార్టీ పటిష్టతకు కార్యక్రమాలు చేపడుతున్నాము. సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సలహాలు, సూచనలతో కామారెడ్డి నియోజకవర్గంలో విరివిగా, ముమ్మరంగా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు చేపడుతున్నాం. గత 40 ఏళ్లుగా కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లేదు. షబ్బీర్ అలీ నివాసంలో మాత్రం కొనసాగిస్తున్నారు. అయితే ఇటీవలే కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంను ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు మదన్ మోహన్, లక్ష్మి కాంత్ రావ్ సహకారంతో నూతన జిల్లా కార్యాలయం ఏర్పాటు చేయించడం జరిగింది. అప్పటి నుంచి మాపై కక్ష కట్టి బెదిరింపులకు పాల్పడుతున్నారు. కామారెడ్డి నియోజకవర్గం కేంద్రంలో యువత కోసం జాబ్ మేళా నిర్వహించగా 3500 నిరుద్యోగ యువత హాజరు కాగా, వీరిలో 500మందికి వివిధ ప్రయివేట్ కంపెనీలలో ఉద్యోగాలు రావడం జరిగింది. దింతో ఓర్వలేక తమపై తమ టీం పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తుంటే షబ్బీర్ అలీ తో పాటు వారి తమ్ముడు నహీం, కుమారుడు ఇలియాస్, కుటుంబ సభ్యులు మహ్మద్ ఇసాక్ షేర్, సోహెల్ తదితరులు పార్టీ కార్యక్రమాల్లో జోక్యం చేసుకుంటాన్నారు. కామారెడ్డి కాంగ్రెస్ పార్టీలో కుటుంబ పాలనలాగా కొనసాగిస్తూ పార్టీని తమ చెప్పు చేతుల్లో పెట్టుకొని ఎదగనియ్యకుండా ఉన్నారు. ఇప్పటి వరకు 40ఏళు ల్లగా ఎవరిని నియోజకవర్గం దాటకుండ తమ అధీనంలో ఉండే విధంగా తయారీ చేసుకొని చేస్తున్నారు. ఒకసారి కామారెడ్డి కాంగ్రెస్ నియోజకవర్గంలో అధిష్టానం దృష్టి పెట్టి చక్కదిద్దాలని కార్యకర్తలం కోరుతున్నాం. రాబోయే రోజుల్లో కామారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసేలా కలిసి కట్టుగా కృషి చేస్తాం. కాబట్టి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ముఖ్యంగా సీఎం శ్రీ రేవంత్ రెడ్డి , పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ , ఏఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్ ప్రత్యేక ఫోకస్ పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో కామారెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మామిళ్ళ అంజన్న, కామారెడ్డి మున్సిపల్ మాజీ చైర్మన్ గడ్డం ఇందుప్రియా డీడీసీ ఉపాధ్యక్షులు నిమ్మ విజయకుమార్ రెడ్డి, పంపరి లక్ష్మణ్, సబ్బని హరికృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు గడ్డమీది మహేష్, తాటి లావణ్య ప్రసాద్, క్రీడా అధ్యక్షులు నర్సాగౌడ్,మాజీ కౌన్సిలర్లు సలీం, రంగ రమేష్ గౌడ్ మాధవి, చాట్ల వంశీ దీక్షిత, పిడుగు మమత సాయిబాబా, శంకర్రావు, జమీల్, చింతల రవీందర్,మామిళ్ళ రమేష్, కామారెడ్డి సేవాదళ్ యూత్ అధ్యక్షులు నర్సుల మహేష్ శిరీష, గంగుల్ రెడ్డి, సుదర్శన్, ధర్మ గౌడ్, బండారి శ్రీకాంత్, శేఖర్, బల్ల శ్రీనివాస్, అరవింద్, వేణు,కోటేశ్వర్, అరుణ్, ఆబిద్, మున్ను, కర్ణాకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రాహుల్, పండు శ్రీకాంత్, శశి, షాహిద్ ఉన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

-మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని 24 గంటల్లో అన్లోడింగ్ చేయాలి.
-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్.

కథలాపూర్ మండలం (తెలంగాణ పత్రిక) జూన్ 4

జగిత్యాల జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ ప్రక్రియ పర్యవేక్షణలో భాగంగా కథలాపూర్ మండలం కలికోట గ్రామంలో వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు.రైతులకు



ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.ధాన్యం తూకం, నిల్వ,రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు.అదే విధంగా ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. అలాగే రైతులు విక్రయించిన ధాన్యం సకాలంలో మిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ పరిశీలనలో కోరుట్ల ఆర్.డి.వో జివాకర్ రెడ్డి, డి.టి.ఓ సంధాని, డి.సీ. ఎస్.ఓ. జితేందర్ రెడ్డి, తహసిల్దార్ రమేష్, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లోవిద్యార్థుల నమోదు 10 శాతం పెంచేందుకు కృషి చేయాలి

-జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి ,జూన్ 4, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డిజిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు , మోడల్ స్కూళ్లు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల నమోదును గత ఏడాదితో పోలిస్తే కనీసం 10 శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని తన ఛాంబర్ నుంచి కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, మండల విద్యాధికారులు , కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రవేశాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డులో విద్యార్థుల నమోదు కోసం ప్రత్యేక ప్రచారం నిర్వహించాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో అందుబాటులో ఉన్న నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజన పథకం వంటి సౌకర్యాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. పాఠశాల వయస్సు పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేర్పించేందుకు ప్రత్యేక బృందాలతో క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. డ్రాప్అవుట్ విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రవేశాల ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, రోజువారీ పురోగతిని సమీక్షిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ పేర్కొన్నారు. టెలి కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్గిరి, సంబంధిత విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, మండల విద్యాధికారులు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# కామారెడ్డి లో భారీ వర్షంతో జలం మాయమైన రోడ్లు



కామారెడ్డి, జూన్ 4,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి పట్టణంతో పాటు నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కామారెడ్డిని అతలాకుతలం చేసింది. పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ డ్రెయినేజీ నీటితో చెరువులను తలపించేలా మారాయి. దాంతో వాహనాలు ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. వర్షపు నీటిలో పలు వాహనాలు మునిగిపోయాయి. ప్రధానంగా నిజాంసాగర్ చౌరస్తా, లయోలా స్కూల్ చౌరస్తా , పాత బస్టాండ్, సిరిసిల్ల రోడ్, విద్యానగర్ కాలనీ, బతుకమ్మ కుంట, పంచముఖి హనుమాన్ కాలనీ ప్రాంతాల్లో రహదారులన్నీ నీటితో నిండిపోయాయి. పట్టణంతో పాటు ఆయా మండలాల్లో భారీ వర్షం కురిసింది. ప్రస్తుతం రైతుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉండిపోయింది. భారీ వర్షానికి రైతులు ఆగమయ్యారు. ధాన్యం కాపాడుకోవడానికి శతవిధాలా ప్రయత్నించారు. అయినా రైతులకు ఫలితం దక్కలేదు. కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం కుప్పలు, కాంటా చేసి నింపిన ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. దాంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికే ధాన్యం రైస్మిల్లులకు వెళ్లకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను అకాల వర్షం నిండా ముంచింది. సుమారు గంట పాటు పడిన వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# కామారెడ్డి కవికి ప్రశంశలు

కామారెడ్డి ,జూన్ 4,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



విశ్వాసాహితి కళా వేదిక జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవ సంస్థ వారు కనిపించని గాయం అనే శీర్షిక పై జాతీయ స్థా యిలో నిర్వహించిన కవి త పోటీల్లో పాల్గొని ఉత్త మ ప్రతిభ కనబర్చిన కామారెడ్డి పురపాలక సంఘం లింగాపూర్ కు చెందిన లెక్చరర్ ఉమాశేషారావు వైద్యకు ఆ సంస్థ జాతీయ చెర్మెన్ కొల్లు. రమావతి,బోర భారతి దేవి కార్యదర్శి ఇతర నిర్వాహకులు కవిని అభినందిస్తూ ప్రసంశ పత్రాన్ని ఒన్ లైన్ ద్వారా అందించి అభినందించారు.

# అనంతపల్లి గ్రామంలో ప్రజా పాలన గ్రామసభ నిర్వహణ



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 04, తెలంగాణ పత్రిక

బోయినపల్లి మండలం అనంతపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన ప్రభుత్వ ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం, చొప్పదండి ఎమ్మెల్యే మరియు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు ఈ గ్రామసభ నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.గ్రామ సర్పంచ్ గంగాధర కావ్య లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు మరియు వాటి పరిష్కారాలపై గ్రామస్తులతో చర్చించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజల నుంచి పలు సమస్యలు, అభ్యర్థనలు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి అల్వాల ధర్మయ్య, స్థానిక నాయకులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వక్తలు పేర్కొన్నారు.

# ప్రజా భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యం

-గ్రామ ప్రగతికి ప్రత్యేక గ్రామ సభలు దోహదం్న
-ఎంపీడీవో జి.మున్ని.



రాజేంద్రనగర్ ప్రతినిధి జూన్ 04 తెలంగాణ పత్రిక.

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం చౌదరి గూడ గ్రామంలో గురువారం నాడు గ్రామసభ ను నిర్వహించారు.గ్రామ ప్రగతి, అభివృద్ధిపై చర్చించుకోవడానికి ప్రత్యేక గ్రామ సభలు దోహద పడతాయని, ప్రజల భాగస్వామ్యంతో గ్రామ అభివృద్ధికి కార్యాచరణ, ప్రణాళిక రూపొందించవచ్చని ఎంపిడిఓ మున్ని పేర్కొన్నారు. సందర్భంగా వర్షాకాల సన్నద్ధత, పంట మార్పిడి, వ్యవసాయ, ఉద్యానవన శాఖల కార్యాచరణ ప్రణాళిక, బడి బాట, ఘన వ్యర్థాల నిర్వహణ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, విపత్తుల నిర్వహణ, పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం, జల సంరక్షణ, అరైవ్-అలైవ్ తదితర అంశాలపై గ్రామ ప్రజలతో సుదీర్ఘంగా చర్చించి అవగాహన కల్పించారు. తమ మండల, గ్రామాల్లో ఉన్న అధికారులు శాఖల వారీగా ఏయే కార్యక్రమాలు చేపడుతున్నారు అనే విషయాలపై సంపూర్ణ అవగాహన ప్రజలు కలిగి ఉండాలని అన్నారు. వర్షాకాలానికి ముందే గ్రామాల్లోని డ్రైనేజీలు శుభ్రం చేయడం గ్రామ పంచాయితీ బాధ్యత అని తెలిపారు. డ్రైనేజీల్లో ప్లాస్టిక్, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దని కోరారు. ఘన వ్యర్థాల నిర్వహణ -2026 పై ప్రజలు ఖచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని, చెత్తను నాలుగు రకాలుగా వేరు చేయాలని సూచించారు. తడి, పొడి, సానిటరీ, ప్రత్యేక చెత్త గా వేరు చేసి గ్రామ పంచాయితీ వాహనానికి అందించాలని అన్నారు. మన ఆరోగ్యం పాడవకుండా ఉండాలంటే స్వచ్ఛందంగా ఈ సూచనలు పాటించాలని పేర్కొన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించి క్రమం తప్పకుండా నీటి ట్యాంకులను బ్లీచింగ్ తో సిబ్బంది శుభ్రం చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు రాకుండా స్వచ్ఛమైన నీటి సరఫరా అందించే బాధ్యత అధికారులపై ఉంటుందని, నీటి సరఫరా, నిర్వహణ సక్రమంగా లేకపోతే ప్రజలు అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించే బీఎల్ఓ లకు ప్రజలు సహకరించాలని అన్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు.కార్యక్రమంలో సర్పంచ్ మల్చలం లక్ష్మి లంగం , ఉప సర్పంచ్ సంతపూరి ప్రేమ్‌రాజ్ వార్డు సభ్యులు , శంషాబాద్ ఎంపీడీఓ మున్నీ , సీఐ నరేందర్ రెడ్డి , పీహెచ్ సి వైద్యులు, దివ్య , విద్యుత్ శాఖ ఏ ఈ సురేష్ రెడ్డి , వాటర్ గ్రిడ్ ఏ ఈ సౌమ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రత్యేక గ్రామసభల ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం

-జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి ,జూన్ 4, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 532 గ్రామపంచాయతీలలో విడతల వారీగా ప్రత్యేక గ్రామసభలను నిర్వహించేందుకు కామారెడ్డి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు జూన్ 4, 6, 8, 10 తేదీలలో గ్రామసభలు నిర్వహించేందుకు మండల స్థాయి అధికారులను పర్యవేక్షణ అధికారులుగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా గురువారం జిల్లాలోని 136 గ్రామపంచాయతీలలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా దోమకొండ మండలంలోని గొట్టుముక్కుల గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ హాజరై గ్రామస్థులతో సమావేశమయ్యారు. గ్రామ సర్పంచ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, ఇతర జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మురికి కాలువలను శుభ్రపరచడం, పిచ్చి మొక్కలను తొలగించడం, తాగునీటి వనరులు, వాటర్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచడం, వీధి







దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామాల్లో పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని నివారించవచ్చని తెలిపారు. ఘన వ్యర్థాల నిర్వహణ రూల్స్--2026ను గ్రామపంచాయతీలు తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. తడి, పొడి, శానిటరీ , ప్రత్యేక వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి నిర్వహించాలని సూచించారు. గ్రీన్ బుట్టలో తడి వ్యర్థాలు, బ్లూ బుట్టలో పొడి వ్యర్థాలు, రెడ్ బుట్టలో శానిటరీ వ్యర్థాలు, నల్ల రంగు బుట్టలో ప్రత్యేక వ్యర్థాలను వేరు చేసి గ్రామపంచాయతీకి అందించాలని ప్రజలకు సూచించారు. గ్రామసభలో తాగునీటి నిర్వహణ, వర్షపు నీటి సంరక్షణ, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, విపత్తు నిర్వహణ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పంటల మార్పిడి, బడిబాట కార్యక్రమం, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు పంటల మార్పిడిని అలవాటు చేసుకొని ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులను గ్రామసభల ద్వారా గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాభివృద్ధి, ప్రజా భాగస్వామ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో ప్రత్యేక గ్రామసభలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ గ్రామ సభలో ఎఫ్ డి ఓ, డిపిఓ, హార్టికల్చర్, డి ఎల్ పి ఓ, సర్పంచ్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు. గ్రామసభ జయజయ హే తెలంగాణ గీతం తో ప్రారంభించారు.

# ఇంచార్జి మంత్రి చొరవ..ధాన్యం నిల్వకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

-నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి

నంగునూరు,జూన్ 4(తెలంగాణ పత్రిక):

ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి డాక్టర్ వివేక్ వెంకట్ స్వామి ప్రత్యేక చొరవతో ధాన్యం నిల్వ చేసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు సిద్దిపేట జిల్లా నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి తెలిపారు. గట్లమల్యాల, పాలమాకుల గ్రామాల్లో ఉన్న గోదాములను ధాన్యం నిలువ చేసేందుకు మంత్రి ఆదేశాలతో జిల్లా కలెక్టర్ కేటాయించారని చెప్పారు. ఈ మేరకు గురువారం ధాన్యాన్ని ఈ గోదాముల్లో నిలువ చేసే కార్యక్రమాన్ని కొబ్బరికాయ కొట్టి దేవులపల్లి యాదగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గట్లమల్యాల, ఖాతా, అంక్షాపూర్, ముంద్రాయి, రాజగోపాల్ పేట గ్రామాలలోని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేస్తామని చెప్పారు. బియ్యపు మిల్లుల్లో ధాన్యానికి సరిపడా స్థలం లేకపోవడంతో వారు ధాన్యాన్ని దింపుకోవడానికి అంగీకరించడం లేద న్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి నష్టం జరగకుండా గిడ్డం గుల్లో నిల్వ చేయాలని నిర్ణయించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పీఏసీఎస్ లు, డ్వాక్రా మహిళా గ్రూప్ లకు ఎలాంటి సబందం లేకుండా ప్రభుత్వం నేరుగా కొనుగోళ్ళు చేసి డబ్బులు చెల్లించదాంతో పాటు,ప్రభుత్వ గోదాములలో నిల్వలు చేసి రైతులను ఆదుకోవాలని నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఖాతా సర్పంచ్ పుల్లూరు



సోని మహేశ్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పయ్యావుల లింగం, జీపీవోలు మమత, రమేశ్, ఉపసర్పంచులు, తిప్పని శ్రీనివాస్, ఏటి చంద్రం, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ గాండ్ల రమేష్, పీఏసీఎస్ డైరెక్టర్ గంగుల రవి, కరెడ్ల వెంకట్ రెడ్డి, డ్వాక్రా మహిళా సంఘాల సీసీలు, కాంగ్రెస్ నాయకులు బస్వరాజు రాములు, ఆరెపల్లి సురేశ్, రాజు, చంద్రం పాల్గొన్నారు.

# జిల్లాలో రుణ లక్ష్యాల సాధనకు సమన్వయంతో కృషి చేయాలి

-జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి ,జూన్ 4,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డిజిల్లా సంప్రదింపుల కమిటీ జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం గురువారం ఐడీఓసీ కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వివిధ రంగాలకు సంబంధించిన రుణాల పంపిణీ, ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలు, ఆర్థిక సమగ్రత కార్యక్రమాల పురోగతిపై బ్యాంకర్లు ,సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని సూచించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణ ప్రణాళిక అమలును సమీక్షించి, 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. వ్యవసాయం, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, విద్య, గృహ నిర్మాణం తదితర రంగాలకు రుణాల అందజేతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రధాన మంత్రి ముద్ర యోజన , ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం పీఎం విశ్వకర్మ తదితర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు. స్వయం సహాయక సంఘాల బ్యాంకు అనుసంధానం, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా అందజేస్తున్న రుణాల పురోగతిని సమీక్షించారు. జిల్లాలో ఆర్థిక సేవలు ప్రతి అర్హత కుటుంబానికి చేరేలా చర్యలు చేపట్టాలని, బ్యాంకులు ప్రజలకు మరింత చేరువ కావాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్ర శేఖర్, రిజర్వ్ బ్యాంక్ ప్రతినిధులు, నాబార్డ్ అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, జిల్లా స్థాయి శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఉచిత రక్త పరీక్షల కార్యక్రమం ప్రారంభం

కామారెడ్డి ,జూన్ 4, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కామారెడ్డి జిల్లాబిక్నూర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా సంఘాల సభ్యుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత రక్త పరీక్షల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి రక్త పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించి, మహిళలకు నిర్వహిస్తున్న రక్త పరీక్షల తీరును పరిశీలించారు. ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి నివారించేందుకు ఇటువంటి పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రక్తహీనత వంటి సమస్యలను గుర్తించి తగిన చికిత్స పొందాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులు అందరూ ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించ కోవాలని కలెక్టర్ కోరారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత చేరువవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారి రవీందర్, సర్పంచ్ చైర్మెన్, తహసీల్దార్, దామోదర్ రెడ్డి, విజయలక్ష్మి, మండల అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143